
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 7-6-2024 15/-


TIME
The Weekly Newsmagazine
Volume XVII
MAN OF THE YEAR
Number 1

## అదేంటి ప్రధాని గారూ... అలా అనేశారేంటి సారూ ...



## జమాఅత్ నా ఇల్లు ... నా ఇల్లే జమాఅత్...



ఖాలిద్ ముబష్షిర్ జఫర్
అధ్యక్షులు,
జమాఅతె ఇస్లామీ హింద్, తెలంగాణ




భారత దేశ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్న

## ఫేస్‌బుక్

సహజీవన భావనల పావురాయి


# గీటురాయి

వారపత్రిక 7-6-2024 15/-


# అదేంటి ప్రధాని గారూ...

# అలా అనేశారేంటి సారూ ...





సహజీవన భావాల పావురాయి
గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 23 హైదరాబాద్
శుక్రవారం 7 జూన్ 2024 రూ.15-00
29 జీఖఅదహ్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

ముస్లిములారా!
ఒకరిపై ఒకరు
స్పర్థ కలిగి ఉండవద్దు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



16

**హజ్ యాత్ర**

## లోపల...

పాలస్తీనాకు నెతన్యాహు సహాయం ...... 04
అదేంటి ప్రధాని గారూ... అలా అనేశారేంటి సారూ... ...... 05
ప్రీడాధన శ్రేష్ఠుడు – 32 ...... 08
చరితార్థులు-2 : మియా ఫజల్-ఎ-హుసైన్ ...... 11
భారత దేశ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్న ఫేస్‌బుక్ ...... 12
జమాఅత్ నా ఇల్లు... నా ఇల్లే జమాఅత్ ...... 14
వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... 18
అడుగుజాడలు ...... 19
ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది? ...... 20
సంపద పరీక్ష ...... 24
గ్యారంటీ ...... 27
నేటి పరిస్థితుల్లో సత్య సందేశం ...... 28
బరితెగింపు! ...... 31
మనోవాంఛల దాస్యం జీవితంపై వేసే దుష్ప్రభావం ...... 32

**వివాదాస్పద నిర్ణయం?**




తెలంగాణ గీతానికి
కీరవాణి సంగీతం
ఆంధ్రోడే ఎందుకని
తలెత్తింది వివాదం!
రాష్ట్ర చిహ్నంలోనూ
ఉండదట చార్మినారు
యిదే గనక నిజమైతే
అన్యాయం గదసారు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# పాలస్తీనాకు నెతన్యాహు సహాయం

**పాలస్తీనా** ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నెతన్యాహు నిర్ణయాలే ఇప్పుడు పాలస్తీనా ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తున్నాయి. గాజా విషయంలో నెతన్యాహు వైఖరితో పాలస్తీనా ఏర్పాటు ఖాయమయ్యింది. మరోవైపు నెతన్యాహు రాజకీయ భవిష్యత్తు ముగిసే పరిస్థితి వచ్చింది.

స్పెయిన్, ఐర్లాండ్, నార్వే దేశాలు ఇటీవల పాలస్తీనాకు గుర్తింపునిచ్చాయి. పాలస్తీనా ఏర్పడకుండా అడ్డుకోడానికి నెతన్యాహు చేసిన ప్రతి పని పాలస్తీనాకు సహాయపడుతోంది. మరోవైపు ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో సభ్యదేశాలు భారీ మెజారిటీతో పాలస్తీనాకు ఓటు వేశాయి. మరోవైపు అంతర్జాతీయ న్యాయస్థానం నెతన్యాహుపై అరెస్టు వారంటు జారీ చేయాలని నిర్ణయించింది. గాజాలో నెతన్యాహు ప్రారంభించిన యుద్ధంలో 35 వేల మంది అమాయక పౌరులు హతమయ్యారు. ఇందులో పెద్ద సంఖ్యలో పిల్లలున్నారు. ఇప్పుడు ఇస్రాయీల్ పాలస్తీనా సమస్యకు పరిష్కారం పాలస్తీనా ప్రత్యేక దేశంగా ఏర్పడడమేనని అనేకదేశాలు గుర్తిస్తున్నాయి.

నార్వే విదేశాంగ మంత్రి ఈ మాటలు స్పష్టంగా చెప్పాడు. నెతన్యాహు ప్రభుత్వ వైఖరికి ప్రతిస్పందనే పాలస్తీనాను గుర్తించడమని అన్నాడాయన. గత 57 సంవత్సరాలుగా పాలస్తీనా ప్రజలు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇప్పుడీ సమస్య ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. 1947 ఐక్యరాజ్యసమితి తీర్మానం యూదులకు స్వంత దేశం ఏర్పాటును గుర్తించింది. ఆ తర్వాతి నుంచి ఇస్రాయీల్ దురాక్రమణ కొనసాగుతూనే ఉంది. ఇస్రాయీల్ లోని కొత్త తరానికి ఈ పరిస్థితులు సాధారణ పరిస్థితులుగా కనిపిస్తూ ఉండవచ్చు. కాని నిరంతరం అమానుష అణిచివేత క్రింద బతుకుతున్న పాలస్తీనీయులకు ఇది సాధారణ పరిస్థితి కాదు. హమాస్ దాడిని ఈ కోణం నుంచే చూడాలి. రెండు రాజ్యాల పరిష్కారాన్ని దాటవేస్తూ వచ్చిన ఫలితం ఇది.

అమెరికా కూడా రెండు రాజ్యాల పరిష్కారం గురించి మాట్లాడుతుంది. కాని ఇస్రాయీల్‌ను ఈ విషయమై ఒప్పించడం అమెరికాకు సాధ్యం కావడం లేదు. ఇస్రాయీల్‌కు ఆయుధసంపత్తి అందించడం కూడా అమెరికా మానలేదు. ఫలితం అమెరికాలోనే తీవ్రమైన నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా కూడా స్పెయిన్, నార్వేల మాదిరిగా పాలస్తీనాకు గుర్తింపునిచ్చే అవకాశాలు లేవు. కాని పాలస్తీనా విషయంలో ఇప్పుడు అమెరికా కూడ తన రెండుముఖాల వైఖరిని వదిలేయక తప్పని పరిస్థితి ముందుకు వస్తోంది. నెతన్యాహును సమర్థించే క్రమంలో అమెరికా ప్రతిష్ఠ మసకబారుతోంది.


మధ్యప్రాచ్యంలో ఇప్పుడు ఇస్రాయీల్ పరిస్థితి చాలా బలహీనమయ్యింది. ఇస్రాయీల్ ఐరన్ డోమ్‌ను మొదట హమాస్, తర్వాత ఈరాన్ తుత్తునియలు చేశారు. ఇస్రాయీల్ సైనికశక్తి ఇప్పుడు కాగితం పులిగా మాత్రమే కనిపిస్తుంది. ఆసుపత్రులపై బాంబులు వేయడం, సాధారణ ప్రజలను చంపడం తప్ప ఇస్రాయీల్ సైన్యం ఈ యుద్ధంలో చూపించిన ప్రతాపం ఏదీ లేదు. నెతన్యాహు పాలస్తీనా ఏర్పాటును అడ్డుకోడానికి గత పదహారు సంవత్సరాలుగా తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు నెతన్యాహును, ఇస్రాయీల్ దేశాన్ని బోనులో నిలబెట్టాయి.

ఇస్రాయీల్ ఇప్పుడు ఒక చిన్నపాటి గాజాను ఏమీ చేయలేకపోతోంది. రఫాలో మారణహోమం సృష్టిస్తున్నప్పటికీ అక్కడి ప్రతిఘటనను ఆపలేకపోతోంది. ఇంత బలహీనమైన స్థితికి ఇస్రాయీల్‌ను తీసుకొచ్చిన నెతన్యాహు మరోవైపు పాలస్తీనా ప్రజల దృఢ సంకల్పాన్ని, పోరాట పటిమను ప్రపంచం గుర్తించేలా చేశాడు. ఇప్పుడిక పాలస్తీనా ఏర్పాటును ఎవరూ అడ్డుకోలేరు.

అబ్దుల్ వాహెద్

# అదేంటి ప్రధాని గారూ... అలా అనేశారేంటి సారూ ...






గాంధీజీపై సినిమా రాకముందు ప్రపంచంలో గాంధీ గురించి ఎవరికీ తెలియదని అంటే మీరు నమ్ముతారా?

నవ్వొస్తుందా?

ఈసారి ఎన్నికల్లో ప్రధాని మోడీ ప్రసంగాల్లో చెబుతున్న మాటలు, ఇంటర్వ్యూల్లో చెబుతున్న విషయాలు చాలా మందికి మింగుడు పడడం లేదు. ఒక ఇంటర్వ్యూలో అయితే తనను పరమాత్మ స్వయంగా పంపించాడని, తాను బయోలాజికల్ కాదని అన్నారు. మనం విన్నాం...

ఈ మాటలు మనకు అర్థం కాకపోవచ్చు, కాని అర్థం చేసుకునే తెలివితేటలు, వివేకసంపద పుష్కలంగా ఉన్నవాళ్ళు వివరణలు ఇచ్చి అర్థం చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రధాని మోడీ వరుసగా అనేక ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అనేక ర్యాలీల్లో మాట్లాడుతున్నారు. మాంసం, మఛిలీ, మంగళ సూత్రాలు అన్నీ ఆయన ప్రసంగాల్లో దొర్లుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆయన ఒక ఇంటర్వ్యూలో గాంధీజీ గురించి చెప్పారు. రిచర్డ్ అటెన్ బరో తీసిన గాంధీ సినిమా రాకముందు గాంధీజీ గురించి ప్రపంచంలో ఎవరికీ తెలియదని అన్నారు.

గాంధీ సినిమా ఏమిటో ఇప్పుడు చాలా మందికి తెలియక పోవచ్చు. ఈ సినిమా గురించి తెలిసిన వాళ్ళు కూడా దాని గురించి మరిచిపోయి ఉండవచ్చు. ఈ సినిమా 1982లో వచ్చింది. కాని ఈ సినిమా తీయడానికి దర్శకుడు రిచర్డ్ అటెన్ బరో 1962 నుంచి పని ప్రారంభించాడన్నది బహుశా చాలా మందికి తెలియదు. అసలు రిచర్డ్ అటెన్ బరో అనే హాలీవుడ్ దర్శకుడికి గాంధీ జీవితచరిత్రను సినిమా తీయాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందంటే –

గాంధీజీ హత్య జరిగిన రెండేళ్ళ తర్వాత లూయీ ఫిషర్ గాంధీ జీవిత చరిత్రను రాశారు. ఈ లూయీ ఫిషర్ ఎవరో కూడా మనం తెలుసుకోవాలి. ఈ కాలంలో సమస్య ఏమిటంటే, ఏదీ తెలుసుకోకుండానే చాలా మంది మాట్లాడేస్తుంటారు.

లూయీ ఫిషర్ అమెరికాకు చెందిన జర్నలిస్టు, 1896లో పుట్టాడు. ఈయన గాంధీజీ జీవితచరిత్రనే కాదు లెనిన్ జీవిత

చరిత్రను కూడా రాశాడు. లూయీ ఫిషర్ గాంధీజీ జీవిత చరిత్రను రాసింది 1950లో. ఒక అమెరికన్ రచయిత గాంధీజీ జీవిత చరిత్రను రాయడానికి పూనుకున్నాడంటే, అప్పటికే గాంధీజీ గురించి ప్రపంచానికి తెలుసని అర్థమవుతుందా? లేదా??

ఈ జీవిత చరిత్ర చదివిన రిచర్డ్ అటెన్ బరోకు గాంధీ జీవితంపై సినిమా తీయాలన్న ఆసక్తి కలిగింది. ఈ జీవిత చరిత్రను అటెన్ బరో 1962లో చదివాడు. చివరకు ఈ సినిమా 1982లో పూర్తయ్యింది. ఇరవయ్యేళ్ళు శ్రమించి తీసిన సినిమా ఇది. ఇదే విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ కూడా అప్పట్లో రాసింది. ఈ సినిమాను అటెన్ బరో చాలా సమయం వెచ్చించి, పూర్తి శ్రద్ధతో తీశాడు. సినిమా కోసం ఆయన 1963లో భారతదేశానికి వచ్చాడు. అప్పటి ప్రధాని జవాహర్ లాల్ నెహ్రూను కలుసుకున్నారు. గాంధీజీ గురించి నెహ్రూతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

అసలు అటెన్ బరో ఈ సినిమా తీయకముందు కూడా 1968లో ఫిల్మ్ డివిజన్ గాంధీజీపై ఐదు గంటల నిడివి వున్న డాక్యుమెంటరీ తయారు చేసింది.

గాంధీ సినిమా రాకముందు గాంధీజీ గురించి ఎవరికీ తెలియదని చెప్పిన మోడీ గారు రేపు తాను చెప్పడం వల్లనే గాంధీ సినిమా గురించి ప్రజలకు తెలిసిందని లేకపోతే ఆ సినిమా గురించి కూడా ఎవరికీ తెలియదని చెప్పినా ఆశ్చర్యం లేదని కొందరు హాస్యమాడుతున్నారు.

గాంధీ సినిమా కోసం అప్పట్లో అంటే 1980లో ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ ప్రభుత్వం తరఫున సినిమా నిర్మాణానికి నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సహకారం అందించారు. ఒకవిధంగా భారత ప్రభుత్వం కూడా ఈ సినిమా నిర్మాణంలో సహనిర్మాతగా చెప్పాలి. అంటే, గాంధీ సినిమా వెనుక నెహ్రూ ప్రమేయమూ ఉంది, గాంధీజీ ప్రమేయమూ ఉంది. గాంధీజీ గురించి మనం ప్రపంచానికి చెప్పలేదని అనడంలో ఔచిత్యం ఎక్కడుంది? అసలు గాంధీజీ గురించి ప్రపంచానికి చెప్పవలసిన అవసరమేముంది? అప్పటికే యావత్తు ప్రపంచానికి ఆయన గురించి తెలుసు.

ఈ ఇంటర్వ్యూ చేసిన జర్నలిస్టులు మోడీ గారి మాటలను చాలా శ్రద్ధగా తలవూపుతూ విన్నారు. గాంధీజీ సినిమా రాకముందే గాంధీజీ జీవిత చరిత్రను ఒక అమెరికన్ రచయిత రాశాడని, అప్పటికే ఆయన గురించి ప్రపంచానికి బాగా తెలుసని ఒక్క మాట చెప్పలేదు ఈ సోకాల్డ్ జర్నలిస్టులు. భారత పాత్రికేయ చరిత్రలో ఈ సంఘటనలు ఎలా మిగిలిపోతాయో పాఠకులే ఊహించగలరు.

కాని మోడీ ఈ మాటలు... అంటే గాంధీ సినిమా కన్నా ముందు గాంధీ ఎవరో ఎవరికీ తెలియదని చెప్పిన మాటల తర్వాత, ఈ సోషల్ మీడియా కాలంలో చాలా మంది రిసెర్చ్ మొదలు పెట్టి అనేక వివరాలు బయటపెట్టారు. గాంధీ సినిమా కన్నా ముందు ఎవరెవరు గాంధీజీ గురించి ఎప్పుడేమన్నారన్న వివరాలు తీసి చూపిస్తున్నారు. 1931లోనే ప్రముఖ పత్రిక "టైమ్" మ్యాగజైన్ గాంధీజీని మ్యాన్ ఆఫ్ ది ఇయర్ గా ముఖ చిత్రం ప్రచురించింది. అప్పట్లో గాంధీజీని టైమ్ మ్యాగజైన్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్‌గా చూపిస్తే, అదే టైమ్ మ్యాగజైన్ మోడీ ముఖచిత్రాన్ని ఏమని వేసిందో మనం ప్రత్యేకంగా ఇక్కడ ప్రస్తావించుకోవలసిన అవసరమేమీ లేదు.

ఈ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ చెప్పిన మాటలు విచిత్రమైనవి. మార్టిన్ లూథర్ కింగ్ గురించి ప్రపంచానికి తెలుసు, దక్షిణాఫ్రికాకు చెందిన నెల్సన్ మండేలా గురించి ప్రపంచానికి తెలుసు, మన గాంధీజీ వాళ్ళ కన్నా తక్కువేమీ కాదు అన్నారు. ఇది మహావిచిత్రం. ఎందుకంటే, అట్లాంటాలో మార్టిన్ లూథర్ కింగ్ మ్యూజియం ఒకటి ఉంది. ఆయన చిన్నప్పుడు నివసించిన ఇల్లు అక్కడ ఉంది. ఈ మ్యూజియం ప్రాంగణంలో గాంధీజీ విగ్రహం ఎప్పటి నుంచో ఉంది. తనపై గాంధీజీ ప్రభావం ఉందని మార్టిన్ లూథర్ కింగ్ అనేకసార్లు తన ప్రసంగాల్లో చెప్పారన్నది ఈ విషయాలు చదువుకున్న వారందరికీ తెలుసు. గాంధీజీ చెప్పిన అహింసామార్గం తనను ప్రభావితం చేసిందని కూడా ఆయన అనేకసార్లు చెప్పుకున్నారు. లూథర్ కింగ్ రాజకీయాల్లో కూడా గాంధీజీ ప్రభావం మనకు కనిపిస్తుంది. కాని మోడీ గారు ఏమంటున్నారంటే, ప్రపంచానికి మార్టిన్ లూథర్ కింగ్ గురించి తెలుసు కాని గాంధీజీ గురించి తెలియదని అంటున్నారు. ఇదేమి విచిత్రం. స్వయంగా మార్టిన్ లూథర్ కింగ్ తనపై గాంధీజీ ప్రభావం ఉందని చెప్పుకున్నప్పుడు గాంధీ గురించి ప్రపంచానికి తెలియదని కాని మార్టిన్ లూథర్ కింగ్ గురించి తెలుసని ఎవరైనా చెబితే వినేవారికి నవ్వురాదా?

అసలు ఈ ఎన్నికల ప్రచారమే విచిత్రంగా ఉంది. మోడీ గారి ప్రసంగాల్లో ముస్లిములను చొరబాటుదారులు, అధికసంతానం ఉన్నవాళ్ళని చెప్పడం. ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ మాంసం, చేపల గురించి చెప్పడం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందూ మహిళల మంగళ సూత్రాలు కూడా లాక్కుని

ముస్లిములకు పంచేస్తుందని, రెండు గేదెలుంటే ఒక గేదె లాక్కుని ముస్లిములకు ఇచ్చేస్తుందని చెప్పడం, తాను అవతార పురుషుడి నని, బయోలాజికల్ కాదని, తనను పరమాత్మ స్వయంగా పంపించాడని చెప్పడం... ఇవన్నీ చూస్తుంటే ఏమనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో ఆయనెన్నడూ నిరుద్యోగం, అధికధరలు, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల గురించి మాట్లాడలేదు. ఇంటర్వ్యూలో పాత్రికేయులతో మార్టిన్ లూథర్ కింగ్ గురించి, మండేలా గురించి జ్ఞానబోధ చేశారు.

నెల్సన్ మండేలా గురించి ప్రపంచానికి తెలుసు కాని గాంధీజీ గురించి ప్రపంచానికి తెలియదని ఆయన చెప్పిన మాటలు హాస్యాస్పదం కాదా? నెల్సన్ మండేలాను దక్షిణాఫ్రికా గాంధీ అంటారని మోడీ గారికి తెలియదా? నెల్సన్ మండేలా స్వయంగా తాను గాంధీజీ చూపించిన మార్గంలో నడుస్తున్నానని చెప్పు కున్నారు. 28 సంవత్సరాల కారాగారవాసం తర్వాత విడుదలై నప్పుడు తనకు గాంధీజీ ప్రేరణ అన్నారు. 1906లో దక్షిణాఫ్రికాలో గాంధీజీ సత్యాగ్రహ ఉద్యమం శతజయంతి సందర్భంగా 88 సంవత్సరాల మండేలా మాట్లాడుతూ గాంధీజీ పవిత్రయోధుడని చెప్పారు. నీతి, నైతికతలే ఆయుధాలుగా ఆంగ్లేయులతో పోరాడారని చెప్పారు. ఈ వార్త 2007లో రాయిటర్ రాసింది. ఆయన మాట్లాడిన ఆ కార్యక్రమంలో అనేక దేశాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, నోబెల్ బహుమతీ గ్రహీతలు పాల్గొన్నారు. మోడీ గారు మండేలా గురించి ప్రపంచానికి తెలుసు గాంధీ గురించి తెలియదని చెప్పడం... మనం వినడం చేశాం.

ఆయన చెబుతారు... అది నిజం కాదు... వాస్తవాలు ఇవని కొందరు వాస్తవాలు వివరిస్తారు. ఆ తర్వాత ఆయన మరలా ఇంకో కొత్త విశేషం చెబుతారు. ఆ రిసెర్చ్ మొదలవుతుంది.

ఆల్ట్ న్యూస్‌తో నిజనిర్ధారణలకు పేరుపొందిన జుబైర్ మరో విషయాన్ని రిసెర్చ్ చేసి మన ముందుకు తీసుకువచ్చారు. ప్రధాని మోడీ సెప్టెంబర్ 2018, 30వ తేదీన తన మన్ కీ బాత్ కార్య క్రమంలో గాంధీజీ గురించి మాట్లాడుతూ, గాంధీజీ మొత్తం ప్రపంచానికి ప్రేరణ ఇచ్చిన నాయకుడని చెప్పిన వాస్తవాన్ని వివరించారు. 2018లో గాంధీజీ గురించి మాట్లాడుతూ ప్రపంచానికి ప్రేరణ ఇచ్చిన నేతగా, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా వంటివారికి స్ఫూర్తినిచ్చిన నేతగా చెబుతారు. 2024లో గాంధీజీ గురించి సినిమా రాకముందు ఎవరికీ తెలియదని చెబుతారు. ఇదేమిటి సారూ...

చార్లీ చాప్లిన్ గురించి చాలా మందికి తెలిసే ఉంటుంది. హాస్య నటునిగా చాలా మంది భావిస్తారు. కాని ధైర్యసాహసాలున్న మానవవాది. 1931లో చార్లి చాప్లిన్ ఒకసారి గాంధీజీని కలుసుకున్నారు. చార్లి చాప్లిన్ తీసిన సినిమాల్లో ది గ్రేట్ డిక్టేటర్ ఒకటి. ఈ సినిమా చివరి సీనులో గాంధీజీ భావాలు మనకు కనిపిస్తాయి. అప్పట్లో జర్మనీ నియంత హిట్లర్ పై తీసిన వ్యంగ్య చిత్రం అది. చార్లి చాప్లిన్ తర్వాత గాంధీజీని కలుసుకున్నారు కూడా. గాంధీజీ ఏమిటో ఆయన జీవితకాలంలోనే ప్రపంచానికి తెలుసు.

ఎన్నికల సందర్భంగా మాట్లాడవలసిందేమిటి? ప్రతిపక్షాలు అగ్నివీర్ గురించి ప్రశ్నిస్తున్నాయి. ఆ పథకం ఎంత గొప్పదో చెప్పవలసింది. వ్యవసాయ చట్టాలు ఎంత గొప్పవో చెప్ప వలసింది. నోట్ల రద్దుతో సాధించిన విజయాలు చెప్పవలసింది. జియస్టీ ఎంత గొప్పగా అమలవుతుందో చెప్పవలసింది. నిరుద్యో గాన్ని నిర్మూలించే కార్యక్రమాల గురించి మాట్లాడవలసింది. అధికధరలను నియంత్రించే చర్యల గురించి చెప్పవలసింది. కాని ఈ విషయాలు వదిలేసి మాంసము, మంగళసూత్రాలు, బర్రెలు గేదెలు, చేపలు, మస్జిదు, ముస్లిములు, పరమాత్మ పంపించారనే కథనాలు చెబుతున్నారు. మరోవైపు ప్రతిపక్షాలు ప్రజల సమస్యల గురించి మాట్లాడుతున్నాయి. మోడీ గారు ఇంటర్వ్యూలపై ఇంటర్వ్యూలు ఇస్తూ కూడా ప్రజాసమస్యలపై మాట్లాడడం లేదు. గాంధీ సినిమా రాకపోతే గాంధీజీ గురించి ఎవరికీ తెలిసేది కాదంటున్నారు.

గాంధీజీ గురించి తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. గాంధీజీ జీవితకాలంలోనే ఆయన మాట్లాడిన మాటలు ప్రపంచమీడియాలో శీర్షికలయ్యేవి. ఆయన లండన్ వెళితే ట్రాఫిక్ జామ్ అయిపోయేది. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలాలు స్వయంగా గాంధీజీని తమకు ప్రేరణగా చెప్పు కున్నారు. చార్లీ చాప్లిన్, ఐన్ స్టీన్ వంటి వారు ఆయన్ను తమ ఆదర్శంగా చెప్పుకున్నారు.

తెలుసుకోవలసింది ఏమిటంటే కేవలం కొల్లాయి కట్టుకుంటే ఏం... ఆయన విశ్వవ్యాప్తంగా పేరు సంపాదించారు. లక్షల రూపాయల సూటు తొడుక్కున్నప్పటికీ చాలా మందికి ఇలాంటి గుర్తింపు దొరకదు.

రాహుల్ గాంధీ ఈ విషయం గురించి ట్వీట్ చేస్తూ కేవలం ఎంటైర్ పొలిటికల్ సైన్స్ విద్యార్థులకు మాత్రమే గాంధీజీ గురించి తెలుసుకోవాలంటే సినిమా చూసే అవసరం వచ్చిం దేమో అన్నాడు. ❑

అధ్యాయం -11

32

# వ్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

## ఒప్పుకోలు, వాగ్దానాలు

కమిటీ సభ్యులు కాస్సేపు మౌనం వహించారు, అప్పుడు మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, “మనలో ఎవరు ఖిలాఫత్‌ని వదలుకునేందుకు సిద్ధమవుతారో అతనే, ఈ వర్గంలో తాను ఖిలాఫత్ కొరకు అర్హులని భావించిన వారిని ఎన్నుకోగలడు” అన్నారు. ఆ పైన ఆయనే స్వయంగా, “నేను వదలుకునేందుకు సిద్ధమే” అన్నారు. తదుపరి మహనీయ ఉస్మాన్, అలీ, ఇద్దరూ “మీరు ఎవరిని ఉచితమని భావిస్తే వారిని అమీర్‌గా నియమించడం మాకూ సమ్మతమే” అన్నారు. ఆ తరువాత అందరూ తమ తమ అంగీకారం తెలిపారు. మహనీయ అలీ, “మీరు సకల భావనలకు అతీతంగా కేవలం సముదాయం మేలు దృష్ట్యానే ఎన్నుకోవాలి” అని చెప్పారు.

ఆ పైన మహనీయ అబ్దుర్రహ్మాన్(ర) మూడు పగళ్లు మూడు రాత్రిళ్లు మదీనా వాసులతో, దేశంలో అన్ని ప్రదేశాల నుండి వచ్చిన తెగల నాయకులతో, సేనా నాయకులతో సలహా సంప్రతింపులు జరిపారు. ఇక ఆ రోజు తెల్లవారితే మూడు రోజుల వ్యవధి తీరి పోతుందనగా, తన సలహా సంప్రదింపుల ఫలితం ఇద్దరు అభ్యర్థులను గురించి, అబ్దుర్రహ్మాన్ కొందరు ప్రముఖ సహచరుల్నీ, కడకు ఆ ఇరువురినీ ఒక్కొక్కరినే పిలిచి తెల్లవారే వరకు సంప్రదించారు.

## ప్రకటన, బయ్‌త్

ఆ తరువాత ఆయన ఫజ్ర్ నమాజ్‌కు ముందు ముహాజిరులు, అన్సారుల మేధావులు, నాయకులు, సేనానులు అందరూ ప్రవక్త మస్జిద్‌లో సమావేశమవ్వాలని పిలుపునిచ్చారు. అందరికీ అర్థం అయింది, ఖిలాఫత్ ప్రకటన జరుగుతుందని. మస్జిద్ ఏ మాత్రం జాగా మిగలకుండా నిండిపోయింది. ఎన్నిక ప్రక్రియ అధినేత అబ్దుర్రహ్మాన్ నిలబడి చెప్పసాగారు, “దూరప్రాంతాల నుండి వచ్చిన వారందరూ సముదాయం నాయకునిగా ఎవరు ఎన్నికయ్యారు అన్న విషయం తెలుసుకోవాలన్న ఆత్రుతతో ఉన్నారు, మహనీయ ఉమర్ నిర్ణయించిన వ్యవధి కూడా తీరి పోయింది. ఇక ఆలస్యం జరగరాదు” అంటూ ఉండగానే కొందరు లేచారు.

వారు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేయసాగారు, వాదోపవాదాలు మొదలయ్యాయి. దాన్ని భరించలేక సఅద్ బిన్ అబీ వక్కాస్, “అబ్దుర్రహ్మాన్! నిర్ణయాన్ని ప్రకటించండి, ఉపద్రవం పుట్ట నివ్వకండి” అని పలికారు. అనంతరం

మహనీయ అబ్దుర్రహ్మాన్ ప్రకటించారు, "పేర్కొన్న మహనీయులలో నేను ఒకరి ఎన్నిక విషయంలో బాగా ఆలోచించాను, నా శక్తి మేరకు అన్ని వర్గాల ప్రజల సలహాలు సేకరించాను, నా తీర్పు పట్ల సమ్మతిని పేర్కొన్న సభ్యుల ద్వారా ముందే గైకొన్నాను. అందువల్ల ఇక ఎటునుండీ వ్యతిరేకతకు తావు లేదు" అని పలికి పవిత్ర సాక్ష్య వచనం పఠించారు.

ఆ తరువాత ఇలా ప్రకటించారు, "నేను ఖలీఫాను గురించి ప్రజల అభిప్రాయ సేకరణ జరిపినప్పుడు వారు మహనీయ ఉస్మాన్‌కు సమానంగా మరెవరినీ ఎంచలేదు." అంటూ మహనీయ ఉస్మాన్‌ని సంబోధించి, "దైవాదేశం, ప్రవక్త సంప్రదాయం, ప్రవక్త తరువాత గతించిన ఖలీఫాల సంప్రదాయాన్ని అనుసరించి నేను మీ చేతి మీదుగా బయ్త్ చేస్తున్నాను" అని బయ్త్ చేశారు. ఆ తరువాత తొలుత మహనీయ అలీ ఆపైన అక్కడ హాజరయిన వారంతా బయ్త్ చేసుకున్నారు.

## తొలి ప్రసంగం

బయ్త్ తదుపరి మహనీయ ఉస్మాన్(ర) మింబర్ నెక్కి ముక్తసరిగా ప్రసంగించారు. అందులో ఆయన ప్రపంచ సంపద, జీవితాల అస్థిరతను ప్రస్తావించి వాటి పట్ల మొగ్గు దలను విడనాడ వలసిన ఆవశ్యకతను ఎత్తి చూపారు. దానికి ప్రతిగా పరలోక ప్రతిఫలం గురించి ఆశ గొలిపారు. అది సాధించాలంటే దైవ విధేయత, భయభక్తులు, సదాచరణల ద్వారా దైవ ప్రసన్నత పొందడమే మార్గం అన్నారు. అందువల్ల ఆంతర్య ప్రలోభాలకు, షైతాన్ వంచనలకు లోనవక యావజ్జీవితం దైవ సమ్మతిలో గడిపిన వారే సాఫల్యం పొందుతారని బోధించారు.

ఆ తరువాత మేము ప్రారంభంలో పేర్కొన్న సంక్లిష్టమయిన కేసు ఆయన ముందుకు వచ్చింది. ఆయన దాన్ని ఎంతో వివేచనతో పరిష్కరించి, తన దూరదృష్టిని నిరూపించుకున్నారు.

## పరిపాలనాధికారులకు ఆదేశాలు

ఖిలాఫత్ బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన ఇస్లామీయ రాజ్యాల గవర్నరుల కొరకు ఆదేశాలు జారీ చేశారు. వాటిలో పేర్కొన్న అంశాలు :

"దైవం పాలకులకు, అధికారులకు నియమాలను ఏర్పరిచాడు, మీరయినా నేనయినా వాటిని అమలు పరచడం తప్పనిసరి. ప్రజల పైన కొన్ని హక్కులు (బాధ్యతలు) దైవానికి, రాజ్యానికి, సమాజానికి చెందినవి ఉన్నాయి, వాటిని వారి నుంచి గ్రహించవలసి ఉంటుంది. కొన్ని ప్రజల హక్కులు సమాజం, రాజ్యం పైన ఉన్నాయి, వాటిని వారికి ఇప్పించవలసి ఉంటుంది. మనం ఈ రెండు పనులు, గ్రహించడం, ఇప్పించడం, చేయవలసి ఉంటుంది. మీ వల్ల గ్రహించడం పట్ల సర్వ సన్నద్ధత, ఇప్పించవలసిన చోట అలసత్వం చూపడం జరుగుతుందేమో, జాగ్రత్త! ఇంకా, మనం బాధ్యత తీసుకున్న ముస్లిమేతర సోదరుల ఎడల బాధ్యతలు, వారి విధులను గురించి శ్రద్ధ వహించండి. ఇస్లామీయ చరిత్ర ఈ విధానాల మిశ్రమ సేవలతో నిండి ఉంది, మన పూర్వ మహనీయులు దీన్ని నిర్వర్తించారు. అదంతా మనకు ఆదర్శంగా నిలుస్తుంది. మనం ఏ కారణం వల్ల నయినా ఈ సేవలు నిర్వర్తించ లేకపోతే దైవమూ ప్రజల పట్ల నేరస్తులమవుతాము. ప్రపంచంలో న్యాయం, అప్పగింత, విధి నిర్వహణల భావనలు లుప్తమయిపోతాయి."

సైనిక స్థావరాలు, సరిహద్దుల రక్షణ కోసం నియమితులయిన అధికారులకు ఆదేశాలు :

"ఓ సత్య కాముకులయిన యోధులారా, ఇస్లామీయ సేనాధికారులారా! మీకు మీ విధులు తప్పక గుర్తున్నాయని నాకు గట్టి నమ్మకముంది. ఈ ప్రస్తావన కేవలం దాని పునస్స్మరణ మాత్రమే. ఇంకా మనం స్వీకరించిన బాధ్యతల పట్ల మన భావోద్దీపన మరింత తీవ్రతరం కావాలన్నదే. భావోద్దీపన వల్ల మనలో ఆచరణోద్వేగం, ప్రాణ త్యాగం భావనలు మరింత ఉధృతం కావాలన్నదే! ఈ భావనలే ఇస్లామీయ రాజ్య శక్తి, దాని పరిరక్షణలకు ఊపిరి వంటివి. నాకు ఏ కేంద్రం నుంచి కూడ అక్కడి సైనికులు, వారి నాయకుని మధ్య పరస్పర సమన్వయ లోపం కారణంగా బలహీనత పొడసూపిన సమాచారం అందకూడదని దైవాన్ని వేడుకుంటున్నాను. ఒకవేళ అలా జరిగినట్లయితే రక్షకులకే రక్షణ కరవవుతుంది. దైవికంగా వారి స్థానంలో ఇతర యోధుల్ని, రక్షకుల్ని రప్పిస్తుంది. మీరు ఈ యథార్థాలను ఏ క్షణాన కూడా విస్మరించరాదని, దైవం మీకు ప్రసాదించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాను."

## అలాగే ఖరాజ్, జకాత్, జిజ్యా వసూలు చేసే కలెక్టర్లకు

"దైవం సత్యాన్ని ఇష్టపడతాడు. ఆయన భూమ్యాకాశాలను

సత్యం ఆధారంగానే సృజించాడు, స్థిరపరిచాడు. ఆయన సత్యాన్నే ఆదేశిస్తాడు, సత్యాన్నే స్వీకరిస్తాడు. కనుక ఖిలాఫత్‌కు చెందిన అధికారులారా! మీకు దేనిపైన హక్కు ఉందో దాన్ని ఇచ్చే వానికి కృతజ్ఞతలు తెలిపి మరీ తీసుకోండి, దానికన్నా అధిక సొమ్ము తలంపు నయినా రానివ్వకండి. మీరూ నిజ మయిన అమానతుదారులు అవండి. రేపు ప్రళయ దినాన దేవుని కార్యకర్తలు మిమ్మల్ని నమ్మక ద్రోహం క్రింద పట్టు కోవడం పట్ల భయపడుతూ ఉండాలి.''

## జన సామాన్యం కొరకు సందేశం

“మీరు ముస్లిములు అంటే దైవ విధేయుల సముదాయం. మీరు ఇతరులకూ నేర్పవలసి ఉంది. పరలోకానికి ప్రతిగా ప్రపంచం ఏ మాత్రం విలువ లేనిది. ఇక్కడి శ్రేయో సుఖాలకూ స్థిరత్వం లేదు, ఇక్కడి బాధలూ దుఃఖాలూ నిలువవు. నా భయం ఏమిటంటే ఈ మూణ్ణాళ్ళ ముచ్చ టయిన మోసపుచ్చే ప్రపంచంలోని చమక్కులు మిమ్మల్ని వంచనకు గురి చేస్తావేమో అన్నది! ఇంకా నాకున్న మరో భయం ఏమిటంటే మీరు స్వచ్ఛమయిన ధర్మంలో ఇతరత్రా అప మిశ్రమాలు చేర్చుకుంటారేమో అన్నది!! నా సహోదరు లారా, మూడు విషయాలు చాలా ప్రమాదకరమయినవి, అవి ధర్మంలో కొత్త విషయాలు, విధానాలను సంప్రదా యంగా మార్చనంత వరకు వదలవు :

## ధనసంపదల పెంపుదల

నీచమయిన, దిగజారిన, విశృంఖల స్త్రీల ద్వారా మీ సంతతిలో ప్రగతీ వికాసాలు. విభిన్న ప్రాంతాలలో దివ్య ఖుర్‌ఆన్ పఠనాల వ్యత్యాసం. ఈ విషయాలలో జాగరూకులయి మెలగాలి.

కనుక నా హెచ్చరిక ఏమిటంటే ధర్మాన్ని స్వచ్ఛంగా ఉండ నివ్వండి. మీరు పరస్పర భావ సమైక్యతను స్థిర పరచి ధార్మిక సిద్ధాంతాలనూ కాపాడండి. పరలోకంలో సమాధానం చెప్పుకో వలసి ఉంటుందన్న భావనతో మరీ దైవ అప్రసన్నత నుండి సురక్షితంగా ఉండేందుకు ప్రయత్నం చేయండి.''

## సలహామండలి ఏర్పాటు

ఇస్లామీయ రాజ్య వ్యవహారాలు దైవాదేశం మేరకు సలహా సంప్రతింపుల ద్వారానే నిర్వహించబడతాయి. ఇది సూత్ర ప్రాయంగా ఇస్లామీయ రాజ్య పరిపాలనా విధానానికి భూమిక. *(చూడండి, ఆలె ఇమ్రాన్ 3 : 159, అష్షూరా 42 : 38).* తదనుగుణంగా మహనీయ ఉస్మాన్(ర) తన పాలనలో ముహాజిరులు, అన్సారులలోని అభిప్రాయ సవ్యతగల సహ చర మాన్యులతో ఓ సలహా మండలిని ఏర్పరిచారు. ❑

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు


- ☛ సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ☛ ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ☛ ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థా లను, అపోహలను తొలగించటం.
- ☛ ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.



# మియా ఫజల్-ఎ-హుసైన్

## (1877-1936)

48




**బ్రిటిష్ ఇండియాలో** ముస్లింలకు ప్రప్రథమంగా 'ప్రోవిన్షియల్ సివిల్ సర్వీస్'లో రిజర్వేషన్ కోటా కల్పించిన మియా ఫజల్-ఎ-హుసైన్ ప్రస్తుత పాకిస్థాన్ లోని సియాల్‌కోట్ పట్టణంలోని రాజపుత్రుల కుటుంబంలో 1877 జూలై 14న జన్మించారు. ఆయన తండ్రి ఖాన్ బహదూర్ హుసైన్ భక్షీ జిల్లా జడ్జిగా పనిచేశారు. లాహోర్‌లో విద్యాభ్యాసం చేసి ఆ తరువాత లండన్ వెళ్ళి న్యాయశాస్త్రం అధ్యయనం చేసి ఇండియా వచ్చిన మియా ఫజల్, 1901లో సియాల్‌కోట్‌లో న్యాయవాది వృత్తి చేపట్టారు. 1905లో సియాల్‌కోట్ నుండి లాహోర్ వచ్చిన ఆయన 'ఇస్లామియా కళాశాల' ప్రగతికి తోడ్పాటు నివ్వడమే కాకుండా స్వయంగా 'అంజుమన్-ఎ-హిదాయత్-ఎ-ఇస్లాం' స్థాపించి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 1905లో భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించిన ఆయన అఖిల భారత ముస్లింలీగ్ సభ్యునిగా కూడా పలు కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. 1916లో పంజాబ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులయ్యాక ముస్లింల విద్యాభివృద్ధికి తగిన సదుపాయాలు, అవకాశాలు కలుగజేసినందున ముస్లింలలో అక్షరాస్యుల సంఖ్య 2.42% నుండి 6.7% పెరిగింది. పంజాబ్ ప్రజానీకం హక్కుల కోసం నిరంతరం శ్రమించిన ఆయన హిందూ-ముస్లింల ఐక్యతకు, మత సామరస్యానికి ఎనలేని ప్రాధాన్యతనిచ్చారు. 1917లో ముస్లింలీగ్ పంజాబ్ శాఖ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన మియా హుసైన్ 1919 నాటి సహాయ నిరాకరణోద్యమం, ఆ తరువాత 'కౌన్సిల్స్ బహిష్కరణ' విషయాల్లో భారత జాతీయ కాంగ్రెస్‌తో విభేదించారు. అఖిల భారత ముస్లింలీగ్ నిర్ణయాలతో కూడా పూర్తిగా ఏకీభవించని ఆయన 'పాకిస్థాన్ భావన'ను నిరసించారు. లౌకిక భావజాలానికి వ్యతిరేకంగా ఆంగ్లేయులు గాని, స్వజనులు గాని ఎటువంటి ప్రతిపాదనలు తెచ్చినా, ప్రయత్నాలు చేసినా నిష్కర్షగా వ్యతిరేకించారు. పంజాబ్ ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా మిత్రుడు ఛోటూ రామ్ తదితరులతో కలిసి 1923లో పంజాబ్ నేషనల్ యూనియనిస్ట్ పార్టీ స్థాపించారు. 1930లో మియా ఫజల్-ఎ-హుసైన్ 'వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్' సభ్యులుగా ఎంపిక కాగా పార్టీ అధ్యక్షస్థానాన్ని మిత్రుడు ఛోటూ రామ్‌కు అప్పగించారు. అచిరకాలంలోనే ప్రజాభిమానాన్ని కూడగట్టుకున్న పంజాబ్ నేషనల్ యూనియనిస్ట్ పార్టీ 1936 నాటి పంజాబ్ ఎన్నికల్లో 175 స్థానాలకు గాను 98 స్థానాలలో విజయకేతనం ఎగురవేసింది. అనుక్షణం ప్రజా సేవలో గడుపుతూ 'ది పేట్రియాట్ ఆఫ్ పంజాబ్' అంటూ మహాకవి ముహమ్మద్ ఇక్బాల్ నుండి ప్రశంసలను అందుకున్న ఖాన్ బహదూర్ మియా ఫజల్-ఎ-హుసైన్ తన పార్టీ ఘనవిజయాన్ని చూడకుండానే 1936 జూలై తొమ్మిదిన కన్నుమూశారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




# భారత దేశ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్న ఫేస్‌బుక్

గీటురాయి డెస్క్

**భారతదేశంలో జరుగుతున్న ఎన్నికల్లో విదేశీ జోక్యం గురించి వార్తలు వస్తున్నాయి. విదేశీ కంపెనీలు ఈ ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్న వార్తలు వినిపిస్తున్నాయి. దేశంలో ఒక పార్టీకి విదేశీ కంపెనీలు మద్దతిస్తున్నాయని బ్రిటన్‌కు చెందిన పత్రిక గార్డియన్ రాసింది.**

ప్రపంచంలో ఫేస్‌బుక్‌కు సవాలు విసిరిన సామాజిక మాధ్యమం టిక్ టాక్. ఫేస్‌బుక్‌ను వెనక్కి నెట్టేసి నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందనుకుంటున్నప్పుడు భారతదేశంలో టిక్ టాక్ నిషేధానికి గురైంది. దాంతో ఫేస్‌బుక్ మరలా నెంబర్ వన్ స్థానం నిలబెట్టుకుంది. ఇక్కడ రెండు అంతర్జాతీయ కంపెనీల మధ్య పోటాపోటీలో మనం కూడా ఇరుక్కున్నాం. ఈ కంపెనీలు సగటు భారతీయుడి బుర్రలో తిష్ఠవేసుకుని కూర్చున్న కంపెనీలు. ఈ సామాజిక మాధ్యమాలు ప్రజాభిప్రాయాన్ని మలచడానికి ఉపయోగపడుతున్న సాధనాలు. భారతదేశంలో ఒక పార్టీకి అనుకూలంగా ఫేస్‌బుక్ వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ఇంతకు ముందు కూడా వచ్చాయి. ఇప్పుడు బ్రిటన్ పత్రిక గార్డియన్ ఈ గుట్టురట్టు చేసింది. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా బీజేపీకి ఎలా సహకరిస్తుందో గార్డియన్ వివరించింది. బీజేపీకి అనుకూలంగా కొన్ని ప్రకటనలు వేసే అనుమతి ఫేస్‌బుక్ ఇచ్చింది. అంటే ఈ ప్రకటనల్లో అబద్ధాలు, కృత్రిమ మేధస్సుతో సృష్టించినవి, బీజేపీకి అనుకూలంగా ప్రజలను ప్రభావితం చేసేవి. పైగా పోలింగ్

జరిగే ప్రాంతాల్లో, ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత ఈ ప్రకటనలు ఫేస్‌బుక్‌లో వచ్చేలా చేశారు. పోలింగ్‌కు ముందు కొంత సమయం ఎన్నికల ప్రచారంపై నిషేధం ఉంటుంది. ఇది ఎన్నికల కోడ్. ఈ సైలెంట్ పీరియడ్‌లో ప్రచారం చేయ రాదు. కాని ఫేస్‌బుక్ ద్వారా తన ప్రచారాన్ని బీజేపీ నిరాటం కంగా కొనసాగించింది. ఇదంతా ప్రభుత్వ ఆమోదంలేనిదే జరిగే పని కాదు. నిజానికి ఫేస్‌బుక్‌లో చేసిన ఈ ప్రచారం కూడా అబద్ధాల పుట్ట. డీప్ ఫేక్‌తో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో తయారు చేసిన అబద్ధాల వీడియోలు, ఎలాంటి అబద్ధాలంటే ఒక కాంగ్రెసు నేతలా కనిపిస్తున్న వ్యక్తి భారతదేశాన్ని పాకిస్తాన్‌కు ఇచ్చేయాలని చెబు తున్నట్లు ఒక ప్రకటనలో ఉంది. ఆ వ్యక్తి వెనకాల పాకిస్తాన్ జెండా ఎగురుతోంది. ఇలాంటి అనేక ప్రకటనలు, పోలింగ్ రోజున, ప్రచారం చేయకూడని సమ యాల్లో కూడా ఈ ప్రచారం, అది కూడా విద్వేష ప్రచారం, ముస్లిములపై విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రకటనలు ఫేస్‌బుక్ తీసుకువచ్చింది. ఇందులో చాలా ప్రకటనలు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాకముందు బుక్ చేసినవి. ఈ మొత్తం వ్యవహారాన్ని ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంతో బయట పెట్టింది గార్డియన్.

ఫేస్‌బుక్‌లో ప్రకటనలు ముందుగా అనుమతి పొందవలసి ఉంటుంది. ఒక అథారిటీ ఉంటుంది. ప్రకటనలు విద్వేషాన్ని రెచ్చగొట్టేవిగా ఉంటే వాటిని అనుమతించరాదన్న నియమం ఉంది. కాని ఫేస్‌బుక్ ఇవేవీ పట్టించుకోలేదు. ఈ ప్రకటనలన్నీ ముందుగా తయారై మెటా లైబ్రరీలోకి వచ్చాయి. ఆ తర్వాత పోలింగ్ రోజుకు ముందు, ప్రచారం ఆగిపోయిన తర్వాత ఫేస్ బుక్ రంగంలోకి దిగి బీజేపీకి అనుకూలంగా ఈ విద్వేష ప్రకటన లను విడుదల చేసింది. పోలింగ్ రోజుకు ముందు ప్రచారం నిషిద్ధం. కాని స్వయంగా మోడీ ఈ నిషేధాలను పట్టించుకోరు. పోలింగ్ కొన్ని ప్రాంతాల్లో జరుగుతుంటుంది. పోలింగ్ లేని ప్రాంతాల్లో మోడీ గారి ర్యాలీ జరుగుతుంటుంది. చానళ్ళు లైవ్ కవర్ చేస్తుంటాయి. మోడీ గారి ప్రసంగాన్ని పోలింగ్ జరిగే ప్రాంతాల్లో కూడా ప్రజలు చూస్తుంటారు. బెంగాల్ పోలింగ్ జరిగినప్పుడైతే మోడీ ఏకంగా బంగ్లాదేశ్ వెళ్ళి అక్కడ మాట్లాడారు. ఆ ప్రసంగాన్ని ఇక్కడ బెంగాల్ చానళ్ళు ప్రసారం చేశాయి. ఇదంతా ఎన్నికల కమిషన్ చూసీచూడనట్లు ఊరుకుంది. ఇప్పుడు ఫేస్‌బుక్ ద్వారా విద్వేష ప్రకటనలను పోలింగ్ రోజున విడుదల చేసిన వ్యవహారం బట్టబయలైంది. పైగా ఈ ప్రకటనలన్నీ ఏఐ సహాయంతో తయారు చేసిన అబద్ధాల ప్రచారాలు. వీటిని ఫేస్‌బుక్ ఎలా అనుమతించింది? ఫేస్‌బుక్‌లో ప్రకటనలిస్తున్నప్పుడు ఏ ప్రాంతంలో ఆ ప్రకటన కనిపించాలో కూడా చెప్పడం జరుగుతుంది. అలాగే ఈ ప్రకట నలు టార్గెటెడ్ ప్రకటనలు కూడా. అంటే ముస్లిములపై విద్వేష ప్రకటనలు ముస్లిముల మొబైల్స్‌లో కనిపించవు. ఎవరి మొబైల్స్ లో కనిపించాలని నిర్దేశించడం జరిగిందో వారి మొబైల్స్ లోనే కనిపిస్తాయి. ఏ ప్రాంతంలో, ఏ వయసు వారికి, ఏ సముదాయం వారికి ఈ ప్రకటనలు చేరాలని నిర్దేశించారో వారికే ఈ ప్రకట నలు వెళతాయి. ఈ మొత్తం వ్యవహారం ఎలా నడుస్తుందంటే, ముస్లిము వ్యక్తి మొబైల్లో వచ్చే ప్రకటన ఒక మాదిరిగా ఉంటుంది. అంటే మోడీ ముస్లిముల కోసం చేసిన మంచిపనుల గురించి ప్రకటనలో ఉంటుంది. అతని పక్కనే ఉన్న మరో వ్యక్తి మొబైల్లో ముస్లిములను బహిష్కరించాలని, వారిని విలన్లుగా చూపించే విద్వేష ప్రచారంతో ఉన్న ప్రకటన కనిపిస్తుంది. ఇది టార్గెటెడ్ ప్రచారం. ఎవరికి ఏది చెప్పాలో అది మాత్రమే చెప్పే ప్రచారం. పైగా ఈ ప్రచారం పోలింగ్ ముందు ప్రచారం నిషేధ మైన సమయంలో ఈ ప్రకటనలు విడుదల చేయడం ద్వారా మెటా కంపెనీ బీజేపీకి సహకరించడమే కాదు, భారత ఎన్నికల్లో జోక్యం చేసుకుంది. ఈ ఎన్నికలకు ముందు మెటా కంపెనీ ఈ ఎన్నికల్లో ఫేస్‌బుక్ పూర్తి బాధ్యతగా ప్రజలను ప్రభావితం చేసే అన్ని చర్యలను అడ్డుకుంటామని, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగే వాతావరణాన్ని కాపాడుతామని కూడా చెప్పుకుంది. మన ఎన్నికల కమీషన్ కూడా ఈ మాటలే చెప్పింది. మతం పేరుతో ఓట్లు అడగనివ్వం. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయని చెప్పింది. కాని ఆచరణలో ఏం జరుగుతుందో అందరం చూస్తూనే ఉన్నాం. ప్రధాని స్వయంగా మతతత్వ ప్రసంగాలు చేస్తున్నా కమీషన్ కనీసం పెదవి విప్పడం లేదు. ఇదే మాదిరిగా మెటా కంపెనీ కూడా మొదట్లో చాలా చాలా మంచి మాటలు, పెద్దపెద్ద మాటలు చెప్పింది. ఆచరణలో మాత్రం ఏఐతో తయారు చేసిన అబద్ధాల ప్రకటనలను విడుదల చేసింది. ఒక ప్రకటనలో ఈవియంలను తగులబెడుతున్న ఫోటో ఉంది. ఒక ప్రకటనలో హిందూ ముస్లిముల ఆరాధనా ప్రదేశాలు తగులబడు తున్న ఫోటోలు, చొరబాటుదారులు భారత సరిహద్దులు దాటి వచ్చేస్తున్నట్లు ఒకదాంట్లో చూపించారు. ఇవన్నీ ఏఐతో తయారు చేసిన అబద్ధాలు. మరి మెటా కంపెనీలో ఉన్న అథారిటీ ఈ ప్రకటనలను ఎలా అనుమతించింది? ఒక ప్రకటనలో మోడీని భీష్ముడిగా చూపించారు. ఇది ఇన్‌స్టాలో ప్రకటనగా వచ్చింది.

**(మిగతా 15వ పేజీలో)**

# జమాఅత్ నా ఇల్లు ...
# నా ఇల్లే జమాఅత్


## - ఖాలిద్ ముబష్షిర్ జఫర్

**అధ్యక్షులు, జమాఅతె ఇస్లామీ హింద్, తెలంగాణ**




"విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుటుంబ సభ్యులనూ మానవులు, రాళ్లు ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి. దానిపై ఎంతో బలిష్ఠులు, అత్యంత కఠినులు అయిన దైవ దూతలు నియమించబడి ఉంటారు వారు ఎన్నటికీ అల్లాహ్ ఆజ్ఞను ఉల్లంఘించరు, వారు తమకు ఏ ఆజ్ఞ ఇచ్చినా, దానిని పాటిస్తారు."

***(దివ్యఖుర్ఆన్ 66 : 6)***

దైవప్రసన్నత పొందడం,పరలోకసాఫల్యం పొందడం–ఈ ప్రేరణే జమాఅతె ఇస్లామీ హింద్‌కు మనం దగ్గరయ్యేలా చేసింది. అందుకే సన్నిహితులు, కుటుంబసభ్యులు, వాళ్ళందరు దైవ ప్రసన్నత పొందాలన్న తాపత్రయం వారందరినీ జమాఅత్ పంక్తుల్లో తీసుకువచ్చే తపనగా మారాలి. ఎందుకంటే వారందరి పరలోక సాఫల్యం గురించిన చింత మనలో ఉండాలి.

ఇంటిని ధర్మానికి, జమాఅతె ఇస్లామీ హింద్ కార్యకలాపాలకు నిలయంగా మార్చడం వల్ల సందేశప్రచార బాధ్యతను నిర్వర్తించడం జరుగుతుంది. ఎందుకంటే, "మీలో ప్రతి ఒక్కరు ఒక పర్యవేక్షకుడు. మీ పర్యవేక్షణ బాధ్యత గురించి అల్లాహ్ ముందు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది." అని ప్రవక్త ముహమ్మద్ (స) ఉపదేశించారు.

మన కుటుంబ సభ్యులను జమాఅతె ఇస్లామీ హింద్ పంక్తుల్లో చేర్చడం ద్వారా వారికి రుజుమార్గం చూపిస్తున్నాం. నరకాగ్ని నుంచి రక్షణ కల్పించే పని చేస్తున్నాం.

వారిని జమాఅతె ఇస్లామీ హింద్ పంక్తుల్లో చేర్చడం ద్వారా మానసిక ప్రశాంతత పొందగలం. ఎందుకంటే చెడుల నుంచి, షైతాను దాడుల నుంచి రక్షణ పొందే ప్రదేశంలో మన సన్నిహితులు చేరడం మనకు ప్రశాంతతనిస్తుంది.

ప్రవక్త ముహమ్మద్ (స) తన సందేశప్రచారాన్ని తన కుటుంబ సభ్యుల్లో మొదట తన శ్రీమతి హజ్రత్ ఖదీజ(రజి), తన పిన తండ్రి కుమారుడు హజ్రత్ అలీ (రజి), తన మిత్రుడు హజ్రత్ అబూబక్ర్ (రజి)లతో ప్రారంభించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులతో సందేశప్రచారం ప్రవక్త సంప్రదాయం.

మనం మాటలతో చెప్పిన విశ్వాసవచనం, ఈ కార్యక్రమాల వల్ల ఆచరణాత్మకం కూడా అవుతుంది. చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేని స్థితి మనకు ఉండదు. అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా చెప్పాడు:

**"విశ్వాసులారా! మీరు చేయని విషయాన్ని చేస్తాము అని చెబుతా రెందుకు? మీరు చేయని దానిని చేస్తాము అని చెప్పటం అల్లాహ్ దృష్టిలో అత్యంత అప్రియమైన విషయం."** (సఫ్: 2,3)

మన సన్నిహితులను, కుటుంబ సభ్యులను జమాఅత్ పంక్తుల్లో చేర్చడం ద్వారా మనం జమాఅత్‌ను బలోపేతం చేయగలం. ఈ పని చేయకపోతే మన పిల్లలు ఇతర సంఘాలు, సంస్థలు, భావాలతో ప్రభావితులయ్యే అవకాశం ఉంది.

ఇలా చేయడం వల్ల మనం మన ఇంటితో బలమైన సంబంధం ఏర్పరచుకోగలం. పరస్పరం ప్రేమాభిమానాలు, నమ్మకం, విశ్వాసాలు పెరుగుతాయి.

సత్యధర్మసందేశ ప్రచారంలోను, ఇస్లామీయ విలువల ప్రచారం లోను కొత్త ఊపు లభిస్తుంది.

మన కుటుంబంలో అమ్మానాన్న, భార్య లేదా భర్త, పిల్లలు ... అలాగే అన్నాతమ్ముళ్లు, అక్కా చెల్లెళ్ళు, వారి పిల్లలు, పిన తండ్రులు, పెదనాన్నలు, మేనమామలు, మేనత్తలు, పినతల్లులు, పెద్దమ్మలు, వారిపిల్లలు, రక్తసంబంధాలు, వైవాహిక సంబంధాల బాంధవ్యాలు, వియ్యంకులు ఇలా అనేకమంది ఉంటారు. ప్రతి వ్యక్తి తన బంధువుల్లో, కుటుంబ సభ్యుల్లో పనిచేసి వారిని జమాఅత్‌కు దగ్గరయ్యేలా చేసేప్రయత్నాలు చేయాలి.

చాలా కుటుంబాలు, బంధువులకు వాట్సప్ గ్రూపులున్నాయి. వాటిని ఉపయోగించుకుని పనిచేయవచ్చు.

మనం చెప్పే మాటలను ఇతరుల కన్నా ఎక్కువ శ్రద్ధగా మన కుటుంబసభ్యులు, బంధువులు, సన్నిహితులు వింటారన్నది మరిచిపోరాదు.

జమాఅతె ఇస్లామీ హింద్‌కు దీనివల్ల బహుముఖ నైపుణ్యాలు లభిస్తాయి.

డ్రాయింగ్ రూములో డిస్కషన్లు, టీ పార్టీలు, కుటుంబ ఫంక్షన్లు, కజిన్ మీట్, పండుగల్లో కలుసుకోవడం, వ్యక్తిగతంగా కలుసు కోవడం, ఫోను చేయడం, మెస్సేజిచేయడం, వాట్సప్ చాట్, ఈ మెయిల్... ఇలా అనేక మార్గాల ద్వారా మన మాటను చేరవేయవచ్చు.

ప్రయత్నించండి. జమాఅత్‌ను బలపరచడానికి పని చేయండి. ★

---

## భారత దేశ ఎన్నికల్లో ...

### (13వ పేజీ తరువాయి)

ఇన్‌స్టాగ్రాంలో మోడీ ఇమేజి పెంచడానికి వేలాది డాలర్లు ఖర్చు పెట్టి నిబంధనలకు విరుద్ధమైన ఫోటోలు పెట్టించారు. ఇందులో చాలా ఫోటోలు ఏఐతో తయారు చేసినవని అల్ జజీరా రిపోర్టు చేసింది. ఈ వ్యవహారాన్ని మనం చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. పొద్దుట లేచి ఒక వ్యక్తి పోలింగ్ బూతుకు వెళ్ళ డానికి సిద్ధమవుతున్నాడు. అతని మొబైల్‌లో ఒక ఫోటో వచ్చింది. సరిహద్దుల్లో చొరబాటుదారులు చొచ్చుకు వచ్చేస్తున్న దృశ్యం, ధార్మిక ప్రదేశాలను తగులబెడుతున్న దృశ్యం అతని మొబైల్‌లో కనిపిస్తుంది. ఆ వ్యక్తి భావావేశాలపై ఎలాంటి ప్రభావాన్ని వేస్తుందో ఒకసారి ఆలోచించండి. అంతకు ముందు వరకు నిరుద్యోగం గురించి, అధిక ధరల గురించి, కుటుంబ ఖర్చుల గురించి ఆలోచించిన వ్యక్తి ... అవి చూసిన తర్వాత అమ్మో... మోడీ లేకపోతే ఇంకేమైనా ఉందా? వీళ్ళంతా దేశాన్ని నాశనం చేసేస్తారని అనుకునే అవకాశం ఉంది. ఇదంతా బ్రెయిన్ వాషింగ్. ఫేస్‌బుక్ చేసిన ఘనకార్యం ఇది. బ్రెయిన్ వాష్‌తో ఓట్లు బీజేపీకి పడేలా చేసే ప్రయత్నం పెద్ద ఎత్తున జరిగింది. ఫేస్‌బుక్ ఇలాంటి స్కాండల్స్‌లో ఇరుక్కోవడం ఇదే మొదటిసారి కాదు. బీజేపీ విషయంలో ఫేస్‌బుక్ స్పెషల్ ట్రీట్మెంట్ ఇస్తుందన్నది కూడా అందరికీ తెలిసిన విషయమే. ఇంతకు ముందు కూడా ఇలాంటి అబద్దాలు, మత విద్వేష కంటెంట్‌ను అనుమతించిన సంఘటనలు ముందుకు వచ్చాయి. భారతదేశంలో మెటా పాలసీ హెడ్‌గా పనిచేసిన అంఖీదాస్ గురించి ఇంతకు ముందు వచ్చిన వార్తలు గుర్తున్నాయి కదా. విద్వేషం నిండిన కంటెంట్‌ను ఆమె అనుమ తించడాన్ని వ్యతిరే కించిన స్టాఫ్ స్వయంగా ఈ వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. చివరకు ఆమె రాజీనామా చేయక తప్పలేదు. భారత దేశంలో ఫేస్‌బుక్ ఉచిత సేవలు అందించడంలేదు. బ్రెయిన్ వాష్ చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఈ వ్యవహారాన్ని మనమందరం అర్థం చేసుకోవడం చాలా అవసరం. ❑



ముహమ్మద్ వహీదుద్దీన్

# హజ్ యాత్ర

**కాబా** అనగా చతురస్రాకారపు గృహం అని అర్థం. దీన్ని 'మస్జిదుల్ హరామ్', 'బైతుల్ అతీఖ్' అని కూడా అంటారు. కాబా గృహం హజ్, ఉమ్రాలకు కేంద్ర బిందువు. కాబా దిక్కువైపునే తిరిగి ముస్లిములు నమాజ్ (ప్రార్థన) చేస్తారు. దీన్ని 'ఖిబ్లా' అని అంటారు. ఈ మస్జిద్‌ను అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం మొట్టమొదట దైవదూతలు నిర్మించారు. ఆ తరువాత తొలి ప్రవక్త ఆదమ్ అలైహిస్సలాం నిర్మించారు. దీన్ని తిరిగి ప్రవక్త ఇబ్రాహీం, ఇస్మాయిల్ అలైహిమస్సలామ్‌లు నిర్మించారు. ఈ పవిత్ర మస్జిద్ భూమండలంపై నిర్మింపబడిన మొదటి ప్రార్థనాలయమే కాక ప్రపంచంలోనే అతిపెద్ద మస్జిద్. ఇది మక్కా నగరంలోని సౌదీ అరేబియా దేశంలో ఉంది. జిద్దా విమానాశ్రయం నుంచి 100 కిలోమీటర్లలోపు ఉన్నది.

ప్రస్తుతం దీని వైశాల్యం 3,56,800 చదరపు మీటర్లు. ఇంకా విస్తరణ పనులు జరుగుతూనే ఉన్నాయి. హజ్ సమయంలో దీని లోపలి వెలుపలి భాగంలో దాదాపు 70లక్షల మంది నమాజ్ చేసే సౌకర్యం ఉంది. కాబా గృహాన్ని బూడిద నీలం రంగు గల రాళ్ళతో కట్టారు. దీని తూర్పు వైపున హజ్రె అస్వద్(నల్లని రాయి) స్థిరపరచి ఉన్నది. దక్షిణాన రుక్నె యమాని ఉంది. ఈ నాలుగు గోడలు 'కిస్వాహ్' (తెర)తో కప్పబడి ఉన్నాయి. ఏడాదికొకసారి హజ్ సమయంలో ఈ వస్త్రాన్ని మారుస్తారు.

ఈ నల్లని వస్త్రంపై పవిత్ర దివ్య ఖుర్ఆన్‌లోని ప్రవచనాలు ఎంబ్రాయిడరీ ప్రక్రియతో అల్లుతారు. ఇది మెరుస్తూ అత్యద్భుతంగా కనిపిస్తుంది. ప్రతి ముస్లిం కళ్ళల్లో జీవిత కాలం మెరిసే మెరుపు ఇది. కిస్వాహ్ రమారమి 47 అడుగుల ఎత్తు, 130 అడుగుల వెడల్పు కలిగి ఉండే ఈ కిస్వాహ్ శతాబ్దాల నాటి చరిత్ర కలిగి ఉన్నది.

**ఖర్చు** : ఈ వస్త్రం తయారీకి ఒకప్పుడు 17 మిలియన్ల సౌదీ రియాల్ ఖర్చు అయ్యేవి. మన కరెన్సీలో చెప్పాలంటే 23 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. నేడు బంగారం, వెండి, పట్టు దారాల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ఖర్చు మరింత పెరిగింది. ఇప్పుడు 30 కోట్ల రూపాయల వరకు ఖర్చుఅవుతుంది.

## హజ్రె అస్వద్

హజ్ర్ అంటే రాయి. అస్వద్ అనగా నల్లని అని అర్థం. అంటే నల్లని రాయి అని అర్థం. ఇది కాబా గృహపు దక్షిణ తూర్పు గోడలో అమర్చబడి ఉంది. ప్రస్తుతం ఇది మూడు పెద్దవి మరెన్నో చిన్నచిన్న ముక్కల్లో గుండ్రటి ఆకారంలో ఉంది. దీనిచుట్టూ వెండి చక్రం ఉంది. హజ్,ఉమ్రా చేసేవారు ప్రతిసారి కాబా గృహ ప్రదక్షిణం చేసేటప్పుడు ఈ రాతిని ముద్దుపెట్టుకోవాలి లేదా దీనివైపు చేయి ఎత్తాలి. కాబా గృహ ప్రదక్షిణం హజ్రె అస్వద్ నుండి ప్రారంభించబడుతుంది. హజ్రె అస్వద్ స్వర్గం నుండి వచ్చింది.

## తవాఫ్

బైతుల్లాహ్ చుట్టూ తిరగటాన్ని ప్రదక్షిణ చేయటాన్ని తవాఫ్ అంటారు.

## జమ్‌జమ్ బావి ప్రత్యేకత

జమ్‌జమ్ బావి 66 అడుగుల వెడెల్పు, 20 మీటర్ల లోతుగా ఉంది. దీని ఊట 4వేల సంవత్సరాల నుండి ఎన్నడూ ఎండిపోలేదు. నీటి రుచి మారలేదు. 24 గంటలూ మోటార్లు నీటిని ఒక సెకనుకు 8వేల లీటర్ల చొప్పున తీస్తూనే ఉంటాయి. కాని 11 నిమిషాల్లో బావి మళ్ళీ నిండిపోతుంది. సుబ్‌హానల్లాహ్ జమ్‌జమ్ నీటిలో కాల్షియం, మెగ్నీషియం లవణాలు, సహజ ఫ్లోరైడ్‌లు, రోగ క్రిమినాశక లక్షణాలు, ఔషధ లక్షణాలున్నాయని శాస్త్రజ్ఞులు రుజువు చేశారు.

## సఫా- మర్వా

సఫా మర్వా రెండు చిన్నచిన్న కొండలు. మక్కాలో ఉన్నాయి. ఇస్మాయీల్ (అలై) ఆకలితో ఏడుస్తుండగా తల్లి హాజిరా (అ) నీటి కోసం ఈ కొండల మధ్య పరుగులు పెట్టారు. ఆ పరుగునే సయీ అంటారు. సయీ అంటే అన్వేషించటం అని అర్థం. హజ్, ఉమ్రాలలో ఈ కొండల మధ్య ఏడుసార్లు నడవడం విధి.

## హజ్

8వ జిల్‌హజ్ నాడు మినాకు వెళ్ళి జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా మరుసటి రోజు ఫజర్ నమాజ్ చేయాలి. అక్కడి నుండి అరఫాత్ మైదానానికి వెళ్ళాలి. (మినా నుండి అరఫాత్ 14 కి.మీ)

9వ రోజు వుఖూఫె అరఫా అంటే 'అరఫాత్ మైదానం'లో కూర్చుని జొహర్, అసర్ నమాజులు చేసి దుఆలు చేస్తారు. మగ్రిబ్ సమయంలో అరఫాత్ మైదానం నుండి 'ముజ్దలిఫా' బయలు దేరాలి. అక్కడ మగ్రిబ్, ఇషా నమాజులు చేయాలి. ముజ్దలిఫాలో రాత్రి దుఆలు చేసుకుంటూ బస చేయాలి. 70 కంకరరాళ్ళను మైదానంలో ఏరుకొని పెట్టుకోవాలి.

10వ రోజు యౌమున్నహర్ అంటారు. 1) ముజ్దలిఫాలో ఫజర్ నమాజ్ చదివి జమరతుల్ అఖ్‌బాపై రమి అంటే రాళ్ళు రువ్వాలి. 2) కాబా గృహ తవాఫ్ చేయాలి 3) ఖుర్‌బాని (జంతువును జిబహ్ చేయడం) ఇవ్వాలి 4) హల్క్ అంటే కేశ ఖండనం.

జమరాత్ (రెండు లేదా మూడు రోజులు అనగా 11,12,13వ రోజు మధ్యాహ్న సమయం నుండి మూడు స్తూపాల వద్ద రాళ్ళు రువ్వాలి).

అయ్యామె తష్‌రీఖ్ అనగా పదవ రోజు నుండి 13వ రోజు వరకు రాత్రి వేళ మినాలో నిద్రించాలి.

## హిరా గుహ

మక్కా నుండి మినా ప్రాంతానికి వెళ్ళే దారి మధ్యలో సుమారు 4. కి.మీ. దూరంలో ఈ గుహ ఉంది. ఈ గుహలోనే ముహమ్మద్ (స)పై ఖుర్‌ఆన్ అవతరణ ప్రక్రియ ప్రారంభమైంది.

తవాఫె విదా వీడ్కోలు ప్రదక్షిణం చేసి మదీనాకు వెళ్ళాలి.

## మదీనా పవిత్రత

'మదీనా మునవ్వర'ను 'మదీనతుర్రసూల్' (ప్రవక్తా నగరి)గా కూడా వ్యవహరిస్తారు. 'మదీన తయ్యిబా' అనేది మరో పేరు. అరేబియా ద్వీపకల్పంలో సముద్ర మట్టానికి 619 మీటర్ల ఎత్తున ఉన్న ఈ చారిత్రక నగరం ఎర్ర సముద్రానికి తూర్పు దిక్కున ఉంది. వేసవికాలంలో ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు మించినప్పటికీ చలికాలంలో మాత్రం ఉష్ణోగ్రత బాగా పడిపోతుంది. ఒక్కోసారి పగటి పూటే సున్నా నుండి 6 డిగ్రీల మధ్య ఎముకలు కొరికే చలి ఉంటుంది. రాత్రి పూట కుండల్లోని నీరు సయితం గడ్డ కట్టుకుపోతూ ఉంటుంది.

**మిగతా 23వ పేజీలో...**

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

19 దైవదూతలు కరుణామయుడయిన దేవుని విశేష దాసులు,[18] వారిని వీరు స్త్రీలుగా నిర్ణయించారు. వారి శరీర నిర్మాణం ఏదయినా వీరు చూశారా?[19] వీరి ఈ సాక్ష్యం నమోదు చేసుకోవడం జరుగుతుంది, వీరు దీనికి జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

20 – 25 వీరంటారు, "ఒకవేళ కారుణ్యప్రభువు (మేము వీటి ఆరాధన చేయరాదని) కోరుకున్నట్లయితే మేము ఎన్నడూ వీటిని పూజించేవారము కాము."[20] వీరు ఈ వ్యవహారంలోని వాస్తవికతను అసలే ఎరుగరు, కేవలం ఊహల బాణాలు వదులుతుంటారు. మేము లోగడ వీరికి ఏదయినా గ్రంథాన్ని ఇచ్చామా? (తమ ఈ దైవదూతల పట్ల భక్తికి) దాని ప్రమాణం ఏదయినా అందులో వీరి వద్ద ఉన్నదా?[21] అదేమీ కాదు, వీరనేదేమిటంటే మేము మా తాతముత్తాతలను ఒక విధానం ఆచరిస్తూ ఉండగా చూశాము, మేము వారి అడుగుజాడలలోనే నడుస్తున్నాము.[22]

18. అంటే, పుంలింగమో, స్త్రీలింగమో అవడం విషయంలో అతీతులయినవారు. ఈ భావం వచన సందర్భాన్ననుసరించి దానంతట అదే ద్యోతకమవుతోంది.

19. మరో అనువాదం ఇలా కూడా సాధ్యమే, "వారి పుట్టుక సమయంలో వీరేమన్నా అక్కడున్నారా?"

20. తమ మార్గవిహీనతకు అదృష్టాన్ని ముడిపెట్టి చేసే వాదన ఇది. తప్పుడు వ్యవహారం చేసే జనులంతా సదా దీన్నే ఆసరాగా తీసుకోవడం పరిపాటి. వారు చెప్పేదేమిటంటే, మేము దైవదూతల్ని ఆరాధిస్తున్నామంటే, అల్లాహ్ మమ్మల్ని ఆ పని చెయ్యడానికి వదలడం వల్లనే కదా అది సాధ్యమయింది. ఆయన ఈ పని మేము చేయరాదని కోరుకుంటే మేమెలా చేయగలిగేవారము? అంతేకాక సుదీర్ఘ కాలంగా ఇది మాలో కొనసాగుతుందాయె, అల్లాహ్ వద్ద నుండి దీనికిగాను ఎటువంటి శిక్షా అవతరించలేదు. దీని భావం ఏమిటీ, అల్లాహ్‌కు మా ఈ పని ఇష్టం లేనిది కాదనేకదా.

21. భావమేమిటంటే, ఈ జనులు తమ అజ్ఞానం మూలంగా, ప్రపంచంలో జరిగేదంతా అల్లాహ్ నిర్ణయం ప్రకారమే జరుగుతోంది గనక, దీనికీ తప్పనిసరిగా అల్లాహ్ ఆమోదం ప్రాప్తమయి ఉంటుంది అని వారు భావిస్తున్నారు. నిజానికి ఈ వాదనా విధానం సరయినదయితే ప్రపంచంలో జరుగుతున్నది, ఒక్క బహు దైవారాధన మటుకే కాదుగా. దొంగతనం, దోపిడి, హత్యా, వ్యభిచారం, లంచం, వాగ్దానభంగం, ఇంకా ఇటువంటి అనేక అపరాధాలు సయితం జరుగుతున్నాయి. వీటిని ఏ వ్యక్తి అయినా సత్కార్యాలని, మంచి పనులని భావించడు. అయితే ఈ వాదనా విధానాన్నిబట్టి ఈ చేష్టలన్నీ ధర్మసమ్మతమయినవే, పరిశుద్ధమయినవే అని అనడం సాధ్యమా? అల్లాహ్ తన ప్రపంచంలో ఇదంతా జరగనిస్తున్నాడు, ఆయన సంభవించనిస్తున్నాడు, గనక ఆయన తప్పనిసరిగా వీటిని ఇష్టపడుతున్నాడు కూడా అని అనడం సబబేనా? అల్లాహ్ ఆమోదం, అనామోదాలను తెలిపే ఆధారం, ప్రపంచంలో జరిగే సంఘటనలు కాదు, అల్లాహ్ గ్రంథం ఆయన ప్రవక్తల ద్వారా అందే ఆ గ్రంథంలో ఆయనకు ఇష్టమయిన, ఇష్టం కానివి ఏ విశ్వాసాలో, ఏ ఆచరణలో ఎటువంటి నైతికతో స్వయంగా ఆయనే తెలుపుతాడు. కనుక దివ్య ఖుర్ఆన్‌కు ముందు వచ్చిన ఏదయినా గ్రంథం వీరి వద్ద ఉన్నట్లయితే, అందులో దైవదూతలు సయితం నాతో పాటు మీకు ఆరాధ్యులే అని, మీరు వాటినీ పూజించాలని అల్లాహ్ తెలిపినట్లయితే ఆ విషయాన్ని వీరు ముందుకు తీసుకురావాలి. (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం. 2, అల్ అన్ ఆమ్: ఆయత్‌లు 107, 112, పాద సూచిక 80, ఆయత్ 138, 148, 149 సం. 3, అల్ ఆరాఫ్ : ఆయత్ 28 ; యూనుస్ : ఆయత్ :99; హూద్: ఆయత్ 118, పాద సూచి 116 సం. 4, అర్ రాద్: పాద సూచి 49; అన్ నహ్ల్: పాద సూచికలు 10, 31, ఆయత్ 93 సం. 7, అజ్ జుమర్: పాద సూచి 20; అష్షూరా : పాద సూచి 11).

22. అంటే, వారివద్ద దైవగ్రంథ ప్రమాణం ఏదీ లేదు. వారివద్ద ప్రమాణం ఏదయినా ఉంటే అది, తాతముత్తాతల కాలం నుండి జరుగుతూ వస్తున్నది మాత్రమే, కనుక వారి అనుసరణలోనే మేము సయితం దైవదూతల్ని దేవతలుగా చేసుకున్నాము అన్నది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

అధ్యాయం : 61

## దైవప్రవక్త(స), ఆయన ప్రియ సహచరులు మక్కా నగరంలో బహు దైవారాధకుల చేత ఎదుర్కొన్న కష్టాల గురించి

**481)** హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) వివరించారు: ఒకసారి నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్) సన్నిధికి వచ్చాను. ఆ సమయంలో ఆయన(స) కాబా గృహం నీడలో ఒక దుప్పటి పరచి, దిండుకు ఆనుకుని కూర్చుని ఉన్నారు. ఆ రోజుల్లో మేము బహుదైవారాధకులు పెట్టే కఠినాతికఠినమైన బాధలను భరిస్తూ ఉన్నాము. నేను ఆయన సమక్షంలో, 'దైవప్రవక్తా! తమరు అల్లాహ్‌ను ఎందుకు మొరపెట్టుకోరు?' అని విన్నవించుకున్నాను. ఇది వినగానే ఆయన(దిండుకు ఆనుకుని కూర్చుని ఉన్నవారల్లా) లేచి నిటారుగా కూర్చున్నారు. (ఆందోళనతో) ఆయన ముఖారవిందం కందిపోయింది. ఆయన(స)ఇలా అన్నారు :"మీకు పూర్వం గతించిన వారు ఇంతకన్నా తీవ్రమైన యాతనల్ని భరించారు. ఇనుప దువ్వెనలతో వారి శరీరాలపై గుచ్చి మాంసం తీసేవారు. అయినా వారు సత్యధర్మం నుండి మరలిపోలేదు. వారి తల మధ్యలో రంపం పెట్టి కోసేవారు. వారి శరీరాలను– నిలువునా– రెండు ముక్కలుగా చీల్చివేసేవారు. అయినప్పటికీ వారు తమ ధర్మం నుండి విముఖులు కాలేదు. (బాగా వినండి! ఒక రోజు తప్పక వస్తుంది) అల్లాహ్ తన కార్యాన్ని పూర్తి చేస్తాడు. ఆనాడు ఒక వ్యక్తి 'సన్ఆ'[1] నుండి హజర్‌మోత్[2] వరకు ఒంటరిగా వాహనమెక్కి ప్రయాణిస్తాడు. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి భయం కూడా అతనికి ఉండదు"– బయాన్ ఉల్లేఖనంలో, "భయమనేది అతనికి ఉంటే తన గొర్రెల్ని తోడేలు ఎక్కడ తినేసి పోతుందోనన్న భయం మాత్రమే ఉంటుంది" అనే వాక్యం అదనంగా ఉంది.


**483)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు నమాజ్ చేస్తూ సజ్దా స్థితిలో ఉండగా, చుట్టుప్రక్కల ఉన్న ఖురైషులు ఆ వైనాన్ని గమనిస్తూ ఉన్నారు. అంతలో ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్ ఒంటె పొట్టలోని కసువును, గర్భకోశాన్ని తెచ్చి దైవప్రవక్త(స) వీపుపై వేశాడు. తత్కారణంగా ఆయన(స) సజ్దా స్థితి నుండి లేవలేకపోయారు. తరువాత ఫాతిమా(ర.అ) వచ్చి, వీపుపైనున్న మాలిన్యాన్ని తొలగించారు. ఈ దుశ్చేష్టకు ఒడిగట్టిన వానికి శాపనార్థం పెట్టారు. దైవప్రవక్త(స) కూడా వారిని శపిస్తూ, "ఓ అల్లాహ్! ఖురైషుల ఈ మూకను పట్టుకో. అబూజహ్ల్ బిన్ హిషామ్‌ను, ఉతబా బిన్ రబీయాను, షైబా బిన్ రబీయాను, ఉమయ్యా బిన్ ఖలఫ్ లేదా ఉబై బిన్ ఖలఫ్‌ను (ఇక్కడ ఉల్లేఖకుడు సందిగ్ధంలో పడ్డారు) పట్టుకో అన్నారు. అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) ఇలా అన్నారు: బద్ర్ యుద్ధ సందర్భంగా వీళ్ళంతా వధించబడటం నేను చూశాను. తరువాత వాళ్ళను ఒక బావిలో పడవెయ్యటం జరిగింది. ఉమయ్యా లేదా ఉబై యొక్క ప్రతి కీలు వేరైపోయింది. అందువల్ల బావిలో పడవెయ్యటం సాధ్యపడ లేదు.'[1]

81-1. 'సన్అ' అనేది యమన్ దేశంలోని ఒక పట్టణం పేరు.

481-2. 'హజర్‌మోత్' ఉత్తర అరేబియాలో ఉంది. హజర్ మోత్‌కి- సన్ఆకి మధ్య కాలినడకన 15 రోజుల ప్రయాణ దూరం ఉంటుంది.

483-1. ఉమయ్యా బిన్ ఖలఫ్ అన్నదే సరైనది. ఎందుకంటే ఉబైని దైవప్రవక్త(స) ఉహుద్ యుద్ధంలో వధించారు.

ఇకపోతే మక్కా నగరిలో దైవప్రవక్త(స)ను అడుగడుగునా వేధించిన సత్య తిరస్కారులకు తగిన శాస్తి జరిగింది.




# ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?

**ఎలక్టోరల్ బాండ్ల** డాటా కావాలని సుప్రీంకోర్టు యస్బీఐని అడిగింది. యస్బీఐ బెంబేలెత్తిపోయింది. అబ్బెబ్బే.. డాటా ఇవ్వలేం... కొన్ని సమస్యలున్నాయి... ఎన్నికలైపోయిన తర్వాత ఇస్తాం అని చెప్పింది. ఆ తర్వాత సుప్రీంకోర్టు చివాట్లు పెట్టి వెంటనే డాటా ఇవ్వాలని ఆదేశించిన కొన్ని గంటల్లో డాటా ఇవ్వక తప్పలేదు. ఎలక్టోరల్ బాండ్ల స్కాము బయటకు రావడంతో అవినీతి తిమింగలాల గురించి తెలిసింది. ఈ అవినీతి కాండ ఎలా నడిచిందో దేశప్రజలకు అర్థమయ్యింది. ఇప్పుడు అంతకన్నా పెద్ద స్కాము సుప్రీంకోర్టు వల్లనే బట్టబయలయ్యేలా ఉంది. ఎలక్టోరల్ బాండ్ల స్కాము తర్వాత ఇప్పుడు ఎలక్టోరల్ ఫ్రాడ్ స్కాము బయటపడేలా ఉంది. నియోజకవర్గాల్లో ఎంత మంది ఓటర్లు ఓటు వేశారో డాటా ఇవ్వమని అడిగింది. పోలింగ్ జరిగిన రోజు రాత్రి ఏడు లోపే పోలింగ్ అధికారులు డాటా పంపించేస్తారు. ఈ డాటాను ఎందుకు ఇవ్వరు? 2019లో ఇచ్చారు కదా. ఈ సారి ఎందుకు ఇవ్వటం లేదు. అని ఎన్నికల కమీషన్‌ను నిలదీసి అడిగింది. ఈ ఒక్క ప్రశ్నతో ఎన్నికల కమీషన్ కంగారెత్తిపోయింది. ఇప్పుడు ఎన్నికల కమీషన్ కూడా యస్బీఐ మాదిరిగానే ఒక పెద్ద జవాబు రాసింది. ఈ డాటా బయటపెట్టాలని నిర్దేశించే చట్టం ఏదీ లేదని, పైగా తమ వద్ద యస్బీఐ మాదిరిగా సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యం లేదని, ఒకవేళ తాము ఎంత మంది ఓటు వేశారో డాటా బయటపెడితే జనం డాటాను మార్చేయవచ్చని, దేశంలో అరాచకమైపోతుందని, ఎన్నికల కమీషన్ పై ప్రజల నమ్మకం పోతుందని. ఇలాంటి సాకులు చాలా రాశారు. ఎంత మంది ఓటు వేశారనే మామూలు ప్రశ్నకు ఎన్నికల కమీషన్ ఎందుకు జవాబు ఇవ్వడం లేదు. ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. మనీష్ ఛిబ్బర్ అనే జర్నలిస్టు దీనిపై ట్వీట్ చేస్తూ 80లలో, 90 లలో కొంతమంది అభ్యర్థులను గెలిపించడానికి బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను కుక్కేవారని రాశాడు. ఇప్పుడు ఎన్నికల కమీషన్ ఓటింగ్ శాతాన్ని రివైజ్ చేసి 6 నుంచి 9 శాతం పెరిగిందని అంటోంది. ఈ అధిక ఓట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? అని ప్రశ్నించాడు. అంటే అర్థమేమిటి? ఈసారి ఎన్నికల్లో అవకతవకలు భారీఎత్తున జరుగుతున్నాయా? ఇందులో ఎన్నికల కమీషన్ పాత్ర ఏమిటి?

ఎన్నికల్లో ఎంతమంది ఓటు వేశారన్నది ఖచ్చితంగా తెలియాలి. ఎందుకంటే జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగినప్పుడు ఎన్ని ఓట్లు

పోలయ్యాయో అన్నే ఓట్లు లెక్కపెట్టడం జరిగిందని తెలుస్తుంది. అంతేకాని, పోలింగ్ కన్నా ఎక్కువ ఓట్లు లెక్కింపులో రాకూడదు. కాని ఈ బేసిక్ డాటా ప్రజలకు చెప్పడం కుదరదని ఎన్నికల కమీషన్ అంటోంది. 2019లో ఈ డాటాను ఎలాంటి అభ్యంత రాలు లేకుండా బయటపెట్టారు. ఇప్పుడేం చేస్తున్నారంటే అసలు ఎన్ని ఓట్లు పోలయ్యాయో చెప్పడం లేదు, పర్సంటేజి చెబుతు న్నారు. ఇందులో కూడా చాలా అనుమానాలున్నాయి. ఓటింగ్ ముగిసిన తర్వాత ప్రారంభంలో చెప్పిన పర్సంటేజికి, తర్వాత రివైజ్ చేసిన పర్సంటేజికి మధ్య చాలా తేడా ఉంది. కోటి మంది కన్నా ఎక్కువ ఓటర్లు పోల్ చేసినట్లు రివైజ్ పర్సంటేజి వల్ల తెలుస్తోంది. అంటే అనేక చోట్ల ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే వ్యవహారం ఇది. ఈ కోటి మంది ఓటర్లు ఎక్కడి నుంచి హఠాత్తుగా వచ్చేశారు? 2019లో నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య, పోలింగ్ రోజున ఎంత మంది ఓటు వేశారు. పర్సంటేజి ఎంత. అంతేకాదు, 2014 డాటా కూడా ఇచ్చి పోల్చి చూసుకునే వీలు కల్పించారు. 2014లో కూడా ఈ డాటా ఇచ్చారు. 2019లో కూడా ఈ డాటా ఇచ్చారు. మొత్తం ఎంత మంది ఓటు వేశారన్న డాటా ఇవ్వడానికి ఎప్పుడు అభ్యంతరాలు లేవు. దీనివల్ల ఎన్ని ఓట్లు పోలయ్యాయో, అన్నే ఓట్లు లెక్కింపు జరిగాయన్నది నిర్ధారించుకునే అవకాశం ఉంటుంది. ఇది ఎన్నికల పారదర్శకత. ఇప్పుడు ఇది మాయమై పోయింది. ఈ సారి మొత్తం ఓటర్ల సంఖ్య, ఓటు వేసిన వారి సంఖ్య చెప్పడం లేదు. దీనికి కారణమేమిటో కూడా చెప్పలేదు. ప్రతి రాష్ట్రంలో, ప్రతి నియోజకవర్గంలో పోలింగ్ పర్సంటేజి డాటా మాత్రమే ఇస్తున్నారు. కాని పోలింగ్ రోజున ఎంత మంది ఓటు వేశారనే సింపుల్ ప్రశ్నకు జవాబు ఇవ్వమంటున్నారు. సరే పర్సంటేజి ఇచ్చారు కదా... ఓటర్ల లిస్టులో ఎంతమంది ఓటర్లు న్నారో తెలుసుకుని, లెక్కలేసి ఎంత మంది ఓటు వేశారో కనిపెట్టు కోవచ్చు కదా అని భక్తులు వాదించవచ్చు. కాని అసలు తిరకాసు ఇక్కడే ఉంది. ప్రతి నియోజకవర్గంలో మొత్తం ఎంత మంది ఓటర్లున్నారో ఆ డాటా కూడా ఇప్పటి వరకు ఎన్నికల కమీషన్ ఇవ్వలేదు. అసలు మొత్తం ఓటర్లు ఎంతమందో తెలియకపోతే ఈ పర్సంటేజి లెక్కలేంటి? పర్సంటేజి లెక్కలేసి ఎంతమంది ఓటు వేశారో తెలుసుకునే అవకాశం ఎక్కడుంది? ఎన్నికల కమీషన్ ఏం చేసిందంటే కేవలం బూత్ లెవెల్ డాటా ఇచ్చింది. వందలాది బూత్‌లున్నాయి. కాబట్టి మీరు మొత్తం నియోజకవర్గంలో ఓటర్లెంత మందో తెలుసుకోవాలంటే బూత్ లెవెల్ డాటాను లెక్కలేసుకుని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ద హిందూ పత్రిక ఈ ప్రయత్నం కూడా చేసింది. వాళ్ళ రిపోర్టు ప్రకారం బీహార్, ఒడిశా, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో అనేక బూత్‌ల డాటా లేదు. అంటే అర్థమేమిటి? ఇక్కడ అవకతవకలు చేసే అవకాశాలు న్నాయి. ఈ అనుమానాలు పెరుగుతున్నప్పుడు ఇలాంటి అనుమానాలు రాకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించే బాధ్యత కమీషన్ పై ఉంది. ఒక్క శాతం ఓట్లు ఇటూ అటూ అయినా ఫలితం మారిపోయే పరిస్థితి చాలా నియోజకవర్గాల్లో ఉంటుంది. అలాంటి నియోజకవర్గాల్లో ఈ పర్సంటేజి గేమ్ గురించి ఆలోచించాలి. రివైజెడ్ పోలింగ్ శాతంలో 3 నుంచి 6 శాతం పెరుగుదల చూపించడాన్ని ఇప్పుడు ఎలా అర్థం చేసుకోవాలి.


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ప్రతి బూత్‌లోను రాజకీయ పార్టీల పోలింగ్ ఏజంట్లు ఉంటారు. ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ అయిపోయిన వెంటనే ఫారం 17సిలో వివరాలు నమోదు చేస్తారు. ఎన్ని ఓట్లు పోలయ్యాయి మొదలైన వివరాలు నమోదు చేస్తారు. నియోజకవర్గం స్థాయిలో రిటర్నింగ్ ఆఫీసర్ ఉంటారు. ఫారం 17సి లు అన్నీ ఆయన వద్దకు వస్తాయి. ఆయన మొత్తం నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయో లెక్కేస్తారు. మొత్తం పోలయిన ఓట్ల ద్వారా పర్సంటేజి తీస్తారు. 2019 వరకు ఎన్నికల్లో మొత్తం పోలయిన ఓట్లు, పర్సంటేజి ఈ వివరాలు ఎన్నికల కమీషన్ ఎలాంటి అభ్యంతరాలు లేకుండా బయటపెట్టేది. ఇప్పుడు ఈ వివరాలు ఇవ్వడం లేదు. ప్రతి నియోజకవర్గంలో మొత్తం ఎంతమంది ఓటర్లున్నారో ఆ వివరాలు ఎన్నికల కమీషన్ దగ్గర ఉన్నాయి. కాని డిజిటల్ ఇండియా కాలంలో కూడా ఈ నెంబర్లు చెప్పడం ఎన్నికల కమీషన్‌కు కష్టమైపోతోంది. వెబ్‌సైటులో అప్డేట్ చేయడం లేదు. పైగా కొన్ని బూత్‌లలో ఎర్రర్ మెస్సేజిలు వస్తున్నాయి. ఇలా ఎందుకు జరుగుతోంది. ఎలాంటి కారణాలు లేకుండా 2024లో రూల్సు ఎందుకు మారిపోయాయి. అందుకే ఎన్నికల కమీషన్ పై అనుమానాలు పెరుగుతున్నాయి.

గతంలో ఎన్నికల కమీషనర్‌గా పనిచేసిన అశోక్ లావాసా రాజీనామా చేయవలసి వచ్చింది. ఎందుకంటే ఆయన 2019 ఎన్నికల్లో ప్రధాని మోడీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదు. ఆ తర్వాత చీఫ్ ఎలక్షన్ కమీషనర్ నియామకం జరిగే ప్రక్రియను కూడా బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంది. తనకు అనుకూలమైన వారిని ఎన్నికల కమీషన్‌లోకి తీసుకువచ్చింది. ఎన్నికలకు ముందు కొత్తగా ఇద్దరు ఎన్నికల కమీషనర్ల నియామకం జరిగింది. ఈ ఎన్నికల్లో ఎన్నికల కమీషన్ మోరల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌ను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. కాబట్టి ఈ అనుమానాలు ఇంకా పెరుగుతున్నాయి. 2019 మొదటి విడత ఎన్నికలు ఏప్రిల్ 19న జరిగాయి. ఆ రాత్రి ఎన్నికల కమీషన్ దాదాపు 60 శాతం పోలింగ్ జరిగిందని ప్రకటించింది. ఏప్రిల్ 26 రెండవ విడత పోలింగ్ జరిగింది. ఆ రాత్రి కమీషన్ ప్రకారం దాదాపు 61 శాతం పోలింగ్ జరిగింది. కాని మొదటి విడత పోలింగ్ ముగిసిన 11 రోజుల తర్వాత రివైజ్ చేసిన డాటా ఇచ్చారు. దీని ప్రకారం 6 శాతం పోలింగ్ శాతం పెరిగిపోయింది. రెండు విడతల పోలింగ్ పరిస్థితి ఇదే. ఇంతగా పోలింగ్ శాతం ఎందుకు పెరిగిపోయిందో వివరణ ఇవ్వలేదు. ఇప్పటికి ప్రతి నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య ఎంత అనే వివరాలు ప్రజలకు తెలియవు. ఈ ఆరు శాతం పోలింగ్ పెరుగుదల ఎలా సాధ్యం? ఎక్కడి నుంచి ఈ కొత్త ఓటర్లు వచ్చారు? ఈ సమస్యకు సులభమైన పరిష్కారం మొత్తం ఓటర్లు, పోలింగ్ రోజున ఓటు వేసిన ఓటర్ల సంఖ్యను తెలియజేస్తే అనుమానాలు తీరిపోతాయి. కాని ఎన్నికల కమీషన్ ఆ వివరాలు చెప్పడానికి సిద్ధంగా లేదు. మే 7వ తేదీన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ విషయమై మూడు ప్రశ్నలు వేశారు. మొదటిది రివైజు చేసిన నెంబర్లు చెప్పడానికి ఇంత ఆలస్యం ఎందుకు జరిగింది? ఆరుశాతం పోలింగ్ పెరుగుదల ఎలా జరిగిందో వివరణ ఏమిటి? ఖచ్చితంగా ఎన్ని ఓట్లు పోలయ్యాయో ఆ సంఖ్యను ఎందుకు చెప్పడం లేదు? ఈ ప్రశ్నలపై కమీషన్‌కు కోపం వచ్చేసింది. ఎన్నికల కమీషన్‌పై బురద జల్లుతారా అని మండిపడింది. బూతు స్థాయిలో పోలింగ్ ఏజంటు వద్ద ఫారం 17సి లో ఉన్న డాటా తీసుకోండి అని చెప్పింది. అంటే పార్టీలు ప్రతి బూతులో ఫారం 17సి లోని డాటాను లెక్కలేసి మొత్తం నియోజకవర్గంలో పోలైన ఓట్ల సంఖ్యను తెలుసుకోవాలి. ప్రతి బూతులో పోలింగ్ ముగిసిన తర్వాత ప్రిసైడింగ్ అధికారి ఫారం 17 సి నింపుతాడు. ఎన్ని ఓట్లు పోలయ్యాయి. ఈవియం మెషిన్ కోడ్ కూడా ఉంటుంది. చట్టప్రకారం రాజకీయపార్టీల పోలింగ్ ఏజంట్లు ప్రిసైడింగ్ అధికారి నుంచి ఫారం 17సి అడిగి కాపీ తీసుకోవచ్చు. ఇదే ఫారం 17సిని ప్రిసైడింగ్ అధికారి తర్వాత రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు. ఇప్పుడు ఎన్నికల కమీషన్ ఏం చెబుతుందంటే, పోలింగ్ ఏజంట్ల వద్ద నుంచి డాటా తీసుకోండి అంటోంది. డాటా సేకరించే పని ఎన్నికల కమీషన్ చేయాలి. పోలింగ్ ఏజంట్లకు ఈ పని ఔట్ సోర్స్ చేశారా? ఈ డాటా ఎన్నికల కమీషన్ వద్ద ఉంది. మరో విషయమేమిటంటే, చాలా బూత్‌ల వద్ద పోలింగ్ ఏజంట్లకు ఈ ఫారం 17సి గురించి తెలియదు. చాలా మంది డాటా ఎన్నికల కమీషన్ ఇస్తుందని ఇంతవరకు నమ్ముతూ వచ్చారు. చాలా మంది చదువుకున్న వాళ్ళు కూడా ఫారం 17సి పేరు కూడా ఇప్పటి దాకా వినలేదు. కాబట్టి చాలా మంది పోలింగ్ ఏజంట్లు అడిగి ఉండరు. ఇప్పుడు వస్తున్న వార్త ఏమిటంటే, పోలింగ్ ఏజంట్లు ఫారం 17సి అడిగినా ప్రిసైడింగ్ అధికారులు ఇవ్వలేదట. కాంగ్రెస్ పార్టీ ట్విట్టరుపై ఈ విషయం గురించి ఎన్నికల కమీషన్‌ను నిలదీసింది. దీంతో ఎన్నికల కమీషన్ పై మరిన్ని అనుమానాలు పెరుగుతున్నాయి. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్ అనే స్వచ్ఛంద సంస్థ ఎలక్టోరల్ బాండ్ల కేసును సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్ళిందని తెలుసు కదా. అదే సంస్థ ఇప్పుడు ఈ వ్యవహారాన్ని కూడా

సుప్రీంకోర్టుకు తీసుకెళ్ళింది. మే 17వ తేదీన చివరకు విచారణ జరిగింది. మొత్తం ఫారం 17సి లు అన్నీ ఎన్నికల కమీషన్ తన వెబ్ సైటులో పెట్టాలని కోరడం జరిగింది. చీఫ్ జస్టిస్ ఈ విషయమై ఎన్నికల కమీషన్‌ను ప్రశ్నించారు. ఎందుకు డాటా బయటపెట్టడం లేదని అడిగారు. కమీషన్ ఎలాంటి సమస్య లేదని, కాని సమయం పడుతుందని చెప్పింది. యస్బీఐ మాదిరి గానే. ఇది అబద్ధం. ఎందుకంటే ప్రిసైడింగ్ అధికారి కేవలం ఒక స్విచ్ నొక్కితే చాలు ఈవియంలో మొత్తం వివరాలు తెలుస్తాయి. మొత్తం పోలయిన ఓట్లు ఎన్నో తెలిసిపోతాయి. ఒకవైపు డిజిటల్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ అంటారు. మరోవైపు డాటా ఇవ్వడానికి చాలా సమయం పడుతుందంటారు. ఎన్నికల కమీషన్ వద్ద ఈ డాటా ఉందన్నది బహిరంగ రహస్యం. ప్రజలు ఎన్నికల్లో పాల్గొంటారు. ఆ ప్రజలకు డాటా చెప్పడానికి అనేక అభ్యంతరాలు ఇప్పుడు చెబుతున్నారు. ప్రజలను నమ్మలేమని, డాటాను మార్ఫ్ చేసి గొడవలు చేస్తారని అంటున్నారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో కూడా ప్రజలకు చెప్పవలసిన అవసరం లేదన్నారు. ఇప్పుడు ఇలాంటి మాటలే ఎన్నికల కమీషన్ సుప్రీంకోర్టుకు చెప్పింది. ఈ మాటలు విన్న తర్వాత ప్రజలకు ఎన్నికల కమీషన్ పై నమ్మకం పెరిగిందా? తగ్గిందా? ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే, మొత్తం ఓట్లు ఎన్నో తెలియవు. పోలింగ్ అయిన ఓట్లు తెలియవు. లెక్కింపు రోజున పోలింగ్ అయిన ఓట్లకు, లెక్కింపు జరుగుతున్న ఓట్లకు మధ్య తేడా వస్తే తెలుసుకునే దారి లేదు. ఫారం 17సి వెబ్ సైటుపై పెట్టాలనే చట్టం ఏదీ లేదని ఎన్నికల కమీషన్ వాదిస్తోంది. కాని ఎన్నికల నిర్వహణ నిబంధనలు 1961, పార్ట్ 2, సెక్షన్ 93 ప్రకారం బ్యాలెట్ పేపర్లు, ఎలక్టోరల్ రోల్స్ తప్ప మిగిలిన డాటా, పత్రాలు ప్రజలకు ఇవ్వాలి. ప్రజలు వాటిని పరిశీలించే అవకాశం ఉండాలి. కాని ఎన్నికల కమీషన్ మొత్తం ఓట్లు ఒక బూత్‌లో ఎన్ని పోలయ్యాయో ప్రజలకు చెప్పడం కుదరదని అంటోంది. అంటే ప్రజాస్వామ్యంలో పారదర్శకత అనేది కుదరదని కమీషన్ ఉద్దేశ్యమా? యస్బీఐ చేసిన వ్యర్థప్రసంగాలపై సుప్రీంకోర్టు వాతలు పెట్టినట్లే ఇప్పుడు కూడా వ్యవహరిస్తే కనీసం ప్రజలకు స్పష్టమైన డాటా దొరుకుతుంది. ఇప్పుడు పార్టీలు కూడా ఫారం సి 17 సేకరించడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తు న్నాయి. హఠాత్తుగా 6 శాతం ఓట్లు పెరిగిపోవడానికి కారణమేమి టన్నది అందరూ అడుగుతున్న ప్రశ్న. దీనిపై ప్రజలు కూడా గొంతు విప్పవలసిన అవసరం ఉంది. లేకపోతే జూన్ 4వ తేదీన రెండు మూడు కోట్ల అదనపు ఓట్లు ఎక్కడి నుంచి వచ్చాయో తెలియని ఓట్లు మొత్తం ఫలితాలను తల్లకిందులు చేస్తాయి.

❖

**17వ పేజీ తరువాయి...**

మక్కానగరం నుండి ఉత్తర దిశలో దాదాపు 450 కి.మీ దూరంలో ఉన్న ఈ నగరం హిజాజ్ క్షేత్రంలో అంతర్భాగం. జనాభా పరంగా సౌదీ అరేబియాలోనే మూడవ అతిపెద్ద పట్టణం. పవిత్ర మక్కా తర్వాత ముస్లిం జగతిలో అత్యంత ప్రియమైన, శుభవంతమైన నగరమిది. అల్లాహ్ అంతిమ సందేశహరులు, విశ్వకారుణ్యమూర్తి ముహమ్మద్ ముస్తఫా(స) నడయాడిన నగరం. సత్సమాజ రూపకల్పనకు కారుణ్యమూర్తి శ్రీకారం చుట్టిన నగరం.

దైవ ప్రసాదిత జీవన సంవిధానం ఆధారంగా ఒక శ్రేయోరాజ్య స్థాపనకు మానవ మహోపకారి నడుం బిగించిన నగరం. దైవదౌత్య పరంపర పరిసమాప్తం గావించబడిన నగరం.

ఒక ప్రవక్తగా మహనీయ ముహమ్మద్(స) తన కర్తవ్యాన్ని నెరవేర్చి శాశ్వతంగా విశ్రమిస్తున్న పవిత్ర నగరం.

## మస్జిదె నబవీ

ఈ పవిత్ర మస్జిద్ మదీనా పట్టణంలో నడిబొడ్డున ఉంది. అక్కడకు వెళ్ళినవారు అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతారు. భక్తి పారవశ్యంలో ఓలలాడుతారు. పూర్వం ఈ మస్జిద్ కట్టడం ఎర్రని రాళ్ళతో నిర్మితమై ఉంటుంది. ఏక కాలంలో లక్షలాది మంది ఈ మస్జిద్‌లో నమాజ్ చేస్తారు.

## గుంబదె ఖజ్రా (పచ్చని గుమ్మటం)

హిజ్రీ శకం 11వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ 12వ తేదీ సోమవారం నాడు మహాప్రవక్త ముహమ్మద్(స) తన సతీమణి హజ్రత్ ఆయిషా(ర) కుటీరంలో పరమపదించారు. ఆయన(స) మహా ప్రస్థానం చేసిన స్థలంలోనే ఆయన పవిత్ర పార్థివ శరీరం ఖననం చేయబడింది. మస్జిద్ ఆవరణలోనే ఉన్నది.

మస్జిదె నబవీ ప్రక్కనే 'జన్నతుల్ బఖీ' (శ్మశానవాటిక) ఉంది. ఎందరో మహా పురుషుల సమాధులు ఉన్నాయి.

మదీనాకు దక్షిణాన 'మస్జిదె ఖుబా' ఉంది. 'మస్జిదె ఖిబ్లాతైన్' మస్జిదె బిలాల్, మస్జిదె హజ్రత్ అలీ, మస్జిదె అబూబకర్, మస్జిదె గమామా ఇంకా ఎన్నో ప్రసిద్ధిగాంచిన మస్జిద్‌లు ఉన్నాయి. ఇస్లామిక్ యూనివర్సిటీ మదీనాలో అతిపెద్ద యూనివర్సిటీ.

మదీనా నగరంలోని ఖుర్‌ఆన్ ప్రింటింగ్ కాంప్లెక్స్ సేవలు కూడా తక్కువేమీ కావు. ప్రపంచంలోని 50పైగా భాషలలో ఇక్కడ ఖుర్‌ఆన్ అనువాదాలు ముద్రితమై ఉచితంగా సరఫరా చేయబడుతున్నాయి.

# సంపద పరీక్ష

- అర్షియా, విజయవాడ



**ప్రస్తుతం** ప్రతీ ఒక్కరి ఆలోచనలూ డబ్బు చుట్టూనే తిరుగుతున్నాయి. సంబంధాలన్నీ మనీ నేపథ్యంలోనే సాగుతున్నాయి. అందుకే 'మనీ మేక్స్ మెనీ థింగ్' అని చెప్పినా.. బ్రతుకు బండిని నడిపేది పచ్చనోటే అని పాడుకున్నామంటే డబ్బు మాయ అంతా ఇంతా కాదు. ఈ భౌతికవాద ప్రపంచంలో ఎంత డబ్బుంటే అంత మంచి జీవితం గడపొచ్చనే మైండ్ సెట్ తయారైంది ప్రతీ ఒక్కరిది. అందరి ధ్యాసా కరెన్సీ నోట్ల చుట్టూనే చక్కర్లు కొడుతోంది. మార్నింగ్ లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకోబోయే వరకూ వీలయినంత డబ్బు సంపాదించడం ఎలా అన్నదే ఆలోచన. బ్యాంకు బాలెన్సు పెంచుకోవడం, లగ్జరీ లైఫ్, ఖరీదైన కార్లు, మంచి ఇల్లు ఇవన్నీ సొంతమవ్వాలనే కలలు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి ఎదిగేదెలా?, బ్యాంకు బ్యాలెన్సు పెంచుకునేదెలా, ఆస్తులు ఎలా పోగేసుకోవాలి? అన్న ప్రణాళికలతో మనిషి ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. రూపాయి విలువ ఎంతగా దిగజారిపోతున్నప్పటికీ ఈ రూపాయి సంపాదన కోసం మనిషి మరీ దిగజారిపోతున్నాడు. సంపద పిచ్చి మనిషిని స్వార్థపరుడిగా మార్చేస్తోంది. నీతి, న్యాయం, సమాజం, ఇరుగుపొరుగు, బంధుమిత్రులు ఈ పట్టింపు లేమీ లేకుండా చేస్తుంది. ఈ తరహా ఆలోచనలు ఒక వర్గానివి.

నాణానికి మరోవైపు చూద్దాం...

డబ్బు సంపాదన అనేది ఏదో పాపంగా భావిస్తారు. సంపాదన అంటే ఇదేదో దునియాదారి అనుకుంటారు. దారిద్ర్యంలో జీవితాన్ని గడపడం, పస్తులుండం పుణ్యప్రదమని భావిస్తారు. ఇదే దైవభీతికి నిదర్శనమని నమ్ముతారు.

పై రెండు భావనలూ ఇస్లామ్‌లో ఆమోదయోగ్యమైనవి కావి. మధ్యే మార్గాన్ని ఇస్లామ్ బోధిస్తుంది. ప్రపంచంలో బ్రతికి బట్టగట్టాలంటే ధన, సంపదలు ఎంతో అవసరం. చేతిలో డబ్బు లేకపోతే బ్రతుకు దుర్భరమే అవుతుంది. నేటి కాలంలో డబ్బు లేకుండా ఏ పనీ కాదు. అందుకే మనిషి డబ్బును ప్రేమించడం కాస్తంత సహజనైజం ఇమిడి ఉంది. ఇది కాదనలేని సత్యం. భార్యాపిల్లలను పోషించుకునేందుకు, అవసరాలు తీర్చుకునేందుకు డబ్బు సంపాదన అవసరమే. సంపాదనకు హద్దులనేవి లేవు. రెండు చేతులా సంపాదించుకోవచ్చు.

స్త్రీలూ, సంతానమూ, వెండి బంగారు రాసులూ, మేలుజాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షకంగా చెయ్యబడింది. (దివ్యఖుర్ఆన్ 3:14)

ఈ సంపదా, ఈ సంతానమూ కేవలం ఐహిక జీవితపు తాత్కాలిక అలంకారాలు మాత్రమే. (ఖుర్ఆన్ 18:46)

ధన, సంపదల పట్ల ప్రేమ పిచ్చిగా మారినప్పుడు డబ్బే సర్వస్వమవుతుంది. గౌరవ ప్రతిష్ఠలకు డబ్బే కొలమానమవుతుంది.

సొసైటీలో స్టేటస్ కు మూలం ధన, సంపదలేనని భ్రమపడతారు. ఈ ఆలోచన విధానం నేటి సమాజంలోనుంచి వచ్చింది కాదని ఖుర్ఆన్ స్పష్టం చేస్తుంది. బనీ ఇస్రాయీల్ జాతిలో తాలూత్ అనే ఒక సాధారణ యువకుడిని అల్లాహ్ రాజుగా నియమించాడని ప్రవక్త ప్రకటించడంతో జాతి ప్రజలు హేళనగా మాట్లాడారు. అతని దగ్గర పెద్దగా ఆస్తిపాస్తులేమీ లేవని అతన్ని మాటలతో తీవ్రంగా తిరస్కరించసాగారు. ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఇలా పేర్కొంటోంది.

“మీకు ఏలికగా అల్లాహ్ తాలూత్‌ను నియమించాడు.” ఇది విని వారు ఇలా అన్నారు : “మాపై రాజ్యం చేసే హక్కు అతనికెలా సంక్రమిస్తుంది? రాజ్యం చేసే హక్కూ, అర్హతలూ అతనికంటే మాకే ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే, అతడు శ్రీమంతుడు కాదు. (ఖుర్ఆన్ 2:247)

## సంపద పరీక్ష..

ప్రపంచంలో మనిషికి  ఒసగబడినవన్నీ పరీక్ష కోసమేనన్నది ఇస్లామీయ భావన. మనిషికి అనుగ్రహించిన, లోబర్చిన అనుగ్రహ భాగ్యాలకుగాను అల్లాహ్‌కు  కృతజ్ఞత  తెలుపుతాడో, లేక అహంకారంతో విర్రవీగుతాడోనని చూసేందుకే.  ఈ ప్రపంచం మనిషికి కర్మల వేదిక. ఇక్కడ దారిద్ర్యమైనా, ధనసంపదలైనా రెండూ పరీక్ష కోసమే. ధన సంపదలు, భార్యా, పిల్లలు, ఆస్తిపాస్తులన్నీ కేవలం పరీక్ష కోసమేనని ఖుర్ఆన్ ఘోషిస్తోంది.

మీ సంపద, మీ సంతానమూ వాస్తవంగా పరీక్షా సాధనాలు. (ఖుర్ఆన్ 8 : 28)

ఈ పరీక్షలో నెగ్గేందుకు కృషిచేసేవారే నిజంగా బుద్ధిజీవులు. ప్రపంచంలో మనిషి తన హక్కుకోసం సాధనతో సాధించి దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిత్యం దైవాన్ని గుర్తుంచుకోవాలి. మన ధన సంపదలు మనల్ని దైవనామస్మరణ నుండి దూరం చేయరాదన్నది ఖుర్ఆన్ హెచ్చరిక.

మీ సిరిసంపదలూ, మీ సంతానమూ మిమ్మల్ని అల్లాహ్ సంస్మరణ నుండి మరల్చరాదు. (ఖుర్ఆన్ 63:9)

## దాన ధర్మాలు..

డబ్బు సంపాదించడం నేరం కాదు. అంతకుమించి పాపమూ కాదంటున్నాయి ఇస్లామీయ బోధనలు. సరైన, సవ్యమైన, పవిత్రమైన మార్గంలో డబ్బు సంపాదన జరగాలి. ‘సంపద ఎలా సంపాదించావు? దాన్ని ఎలా ఖర్చు చేశావు’ అన్నది గమనంలోకి తీసుకోవాలని ముహమ్మద్ ప్రవక్త హితవు. శ్రమించి, నీతి, నిజాయితీగా సంపాదించిన డబ్బును ఇష్టారీతిన ఖర్చుపెట్టడానికి లేదు.  ఖర్చులకు పోగా మిగులు డబ్బును నిరుపేద బంధువులు, ఆదరణ లేనివారికోసం ఖర్చుచేయాలంటోంది ఖుర్ఆన్.

మేము మీకు ప్రసాదించిన సిరిసంపదల నుండి (మా మార్గంలో) ఖర్చుపెట్టండి. (ఖుర్ఆన్ 2:254)

తమ సంపదను రేయింబవళ్ళు బహిరంగంగానూ, రహస్యంగానూ ఖర్చు చేసే వారు తమ ప్రతిఫలాన్ని  తమ ప్రభువువద్ద పొందుతారు. వారికి ఏ విధమైన భయంగాని, దుఃఖంగాని కలిగే అవకాశం లేదు. (ఖుర్ఆన్ 2:274)

తమ సంపదలలో యాచకులకూ, దిక్కులేని వారికి ఒక నిర్ణీతమైన హక్కును ఇచ్చేవారు. (ఖుర్ఆన్ 70 :24)

## ఆ సొమ్ము నిషిద్ధం..

మన సంపాదన అక్రమమా? సక్రమమా? ఒక కన్నేసి ఉంచాలన్నది ఖుర్ఆన్ హెచ్చరిక. హలాల్, హరామ్ విచక్షణ చూడకుండా సొమ్ము చేసుకోవడం అది మహాపాపంగా ఖుర్ఆన్ పేర్కొంటోంది. పరలోక జీవిత సాఫల్యానికి మన డబ్బు అడ్డుకారాదు. అందకే విశ్వాసులు అధర్మ సంపాదనకు దూరంగా ఉండాలని ఖుర్ఆన్ హెచ్చరిస్తుంది.

ప్రజలారా! ఒకరి సొమ్మును మరొకరు అధర్మంగా తినకండి. (ఖుర్ఆన్ 4:29)

అనాథుల ఆస్తిని అన్యాయంగా తినేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటారు. వారు తప్పకుండా మండే నరకాగ్నిలో త్రోయబడతారు. (ఖుర్ఆన్ 4:10)

## గుణపాఠాలు నేర్పే రెండు సంఘటనలు..

ధన, సంపదల విషయంలో మనిషి ఎలాంటి వైఖరిని అల్లాహ్ ప్రేమిస్తాడో, ఎలాంటి ధోరణి అల్లాహ్ ఆగ్రహానికి గురిచేస్తుందో రెండు ఉపమానాల ద్వారా ఖుర్ఆన్‌లో స్పష్టపరిచాడు అల్లాహ్.

## మొదటి ఉపమానం..

ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. వారిలో ఒకనికి రెండు ద్రాక్ష తోటలున్నాయి. అతను వాటి చుట్టూ ఖర్జూరపు చెట్ల కంచెను పెంచాడు.  ఆ తోటల మధ్య ఒక నీటి కాలువ ప్రవాహమూ ఉంది. ఇంకా వాటి మధ్య  సేద్యపు  భూమి ఉంది. ఆ రెండు తోటలు పుష్కలంగా పండాయి. లాభాల పంట పండింది. దీంతో అతనికి  అహంకారం తలకెక్కింది. ఒకనాడు తన పొరుగు మిత్రునితో “నేను నీ కంటే ఎక్కువ ధనం కలవాణ్ణి, ఎక్కువ

బలవంతులైన జనం కలవాణ్ణి. ఎన్నటికైనా ఈ సంపద నశిస్తుందని నేను భావించటం లేదు.'' అని విర్రవీగాడు. తన మిత్రుడిని హేళనగా చూడసాగాడు. కృతఘ్నతకు పాల్పడ్డాడు. పొరుగు మిత్రుడు అతన్ని ఎంతగానో నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. "నీవు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపు. ఎందుకంటే నీ దగ్గర ఉన్న సంపదంతా అది అల్లాహ్ అనుగ్రహమే. అల్లాహ్ తలచుకుంటే నీకు లభించిన సంపదనంతా లాక్కోగలడు. మిత్రుడు చెప్పిన ఈ మాటలేవీ గర్విష్టి తోట యజమానికి రుచించలేదు. అతనిలో పశ్చాత్తప భావమూ కలగలేదు. చివరికి అతని తోటలన్నింటినీ అల్లాహ్ ధ్వంసం చేశాడు. చివరకు అతని పంట మొత్తం ధ్వంసం అయింది, తన ద్రాక్షతోట తలక్రిందులుగా తడికలపై కూలి పోవటాన్ని చూచి అతడు తాను పెట్టిన పెట్టుబడిని గురించి చేతులు నులుముకుంటూ ఉండిపోయాడు.

### రెండవ ఉపమానం

రెండో ఉపమానం మూసా జాతికి చెందిన ఖారూన్ ది. అల్లాహ్ అతనికి ఎన్నో నిధులను ఇచ్చాడు. ఎంతటి సంపన్నుడంటే తన నిధుల తాళపు చెవులను మోసేందుకు బలాఢ్యులైన వ్యక్తులను నియమించుకున్నాడు. బీదలను చూసి ఈసడించుకునేవాడు. తెలివితేటలు లేకపోవడం వల్లనే వారు బీదరికంలో మగ్గుతున్నా రని ఈసడించుకునేవాడు. ఒకసారి అతని జాతి ప్రజలు అతనితో "విఱ్ఱవీగకు, విఱ్ఱవీగే వారిని అల్లాహ్ ప్రేమించడు. అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదతో పరలోకంలో గృహాన్ని నిర్మించుకునే యోచన చేయి. ప్రపంచంలో కూడా నీ వాటాను విస్మరించకు, అల్లాహ్ నీకు ఉపకారం చేసిన విధంగానే నీవూ ఉపకారం చేయి.'' అన్నారు. ఈ మాటలను అతను జీర్ణించుకోలేకపోయాడు. అపుడు అతడు ఇలా అన్నాడు, "నా తెలివితేటలు, నైపుణ్యాలతోనే నాకు అపార సంపద చేకూరింది''ని మిడిసిపడ్డాడు. చివరాఖరికి అల్లాహ్ ఆగ్రహం ఖారూన్‌పై విరుచుకుపడింది. ఖారూన్‌తో సహా తాను నిర్మించుకున్న భవనాలన్నీ నేలమట్టమయ్యాయి. సంపదతో సహా ఖారూన్ భూమిలో కూరుకుపోయాడు.

❖

## విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించటానికి ఎస్ఐఓ నిరంతరం శ్రమిస్తుంటుంది : ఎస్ఐఓ జాతీయ అధ్యక్షుడు బ్రదర్ రమీస్ షేక్




స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఏప్రిల్ 19 నుండి ప్రారంభించిన 50రోజుల దేశవ్యాప్త క్యాంపెయిన్ పర్యటనలో భాగంగా జాతీయ అధ్యక్షులు బ్రదర్ రమీస్ షేక్ మే 25న నంద్యాల సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాలులో విద్యార్థులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో బ్రదర్ రమీస్ మాట్లాడుతూ ఎస్ఐఓ ఆవిర్భవించిన 42 ఏండ్ల కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని విద్యార్థులలో ఉత్తమ నైతిక విలువలు పెంపొందించుటకు నిరంతరం శ్రమిస్తుందని, ఈ నేపథ్యంలో ఎందరో ఉత్తమ డాక్టర్లను, ఇంజినీర్లను, వ్యాపారవేత్తలను, రాజకీయ నాయకులను కూడా సమాజానికి అందించింది అన్నారు. కెరీర్ గైడెన్స్ ఇవ్వటం, విద్యార్థులను ఉత్తమ వ్యక్తులుగా మలచటంలో ఎస్ఐఓ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐఓ రాష్ట్ర అధ్యక్షులు రోషన్ జమీర్ మాట్లాడుతూ దివ్య ఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం వెలుగులో విద్యార్థుల జీవితాలు మలచటానికి కృషి చేస్తుందన్నారు. జెఐహెచ్ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా ఇందాదుల్లా హుసేని ధార్మిక ఉదాహరణలతో యువత జీవిత లక్ష్యాలు వివరించారు. నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ దేశ జనాభాలో నలభై శాతంగా ఉన్న యువశక్తి మనదేశం సంపత్తి అని ఈ విలువైన యువత చెడు రుగ్మతలకు బానిసలు కాకుండా ఉత్తమ పౌరులుగా దేశ పునర్నిర్మాణంలో లీనమై దేశ ఖ్యాతి ఇనుమడించాలంటే ఎస్ఐఓ లాంటి సంస్థలు అవసరం అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు, నంద్యాల ప్రముఖులు అడ్వకేట్ నూర్ అహ్మద్ మదనీ, ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక కన్వీనర్ ముహమ్మద్ అబులైస్, యం.వి.జమాన్, జానోజాగో మహబూబ్ బాషా,జెఐహెచ్ ఫజ్లే హఖ్, వి.సలీం, నవాజ్ ఖాన్, జమీలుద్దీన్, ఖిద్మత్ మేనేజర్ ఫయాజ్, అలీం, ఎస్ఐఓ యూనిట్ ప్రెసిడెంట్ బ్రదర్ అబ్దుల్లా రాయలసీమ ఎస్ఐఓ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**– షేక్ అబ్దుల్ సమద్,**

**నంద్యాల**

# గ్యారంటీ

- షావుల్ హమీద్, నెల్లూరు

**వదిలితే మరలా పీల్చడానికే గ్యారంటీ లేనోడు– మనిషి**

మలమూత్రాల ముద్ద తడిలో ఊపిరి తీసుకున్నవాడు – మనిషి

తినకపోతే చచ్చేవాడు నిద్రపోకపోతే మతిస్థిమితం కోల్పోయేవాడు– మనిషి

జీవితపు ఏ రంగాన నియంత్రణ లేని ప్రాణి– మనిషి

ఎన్ని రాజకీయాలు చేస్తాడో – ఐదేళ్ళు కుర్చీలో కూర్చోవడం కోసం ఎన్ని గ్యారెంటీలు ఇస్తాడో – ఈ మనిషి

అప్పుడెప్పుడో ఓ తత్వవేత్త బాగానే చెప్పాడు "మనిషి కోరికల్లో మకుటాయమానం – తన లాంటి మనుషులకు దైవమై కూర్చోవడం" అని

గ్యారెంటీ ఇవ్వడానికి....

సర్వసత్తాక ప్రభువై వుండాలి..

జననమరణాలకతీతమై వుండాలి..

ఎటువంటి అక్కరలు లేని వాడై వుండాలి..

భవబంధాలు, ఆకలిదప్పులు, నిద్ర అవసరం లేనివాడై వుండాలి..

తన కనుసైగలలో కనిపెట్టుకునే వాడై వుండాలి..

సర్వప్రాణికి జీవన దాత కదా గ్యారంటి ఇచ్చేది

ఇదిగో ఆ గ్యారంటీ....

"ఒకవేళ మీరు మహాపరాధాలకు దూరంగా వుంటే... చిన్న చిన్న పొరబాట్లను మీ నుండి ప్రక్షాళిస్తాము. ఇంకా మిమ్మల్ని గౌరవప్రదమైన స్థానానికి చేర్పుతాము"

గ్యారంటీ అంటే ఇది. మనిషి ఆరుగాలం కష్టపడేది, ఆకాంక్షించేది గౌరవాన్నే కదా! ప్రశాంతతనే కదా!

ఒక్క ఇహంలోనే కాదు సుమా! అంతరాత్మ పరితపించే పరలోకంలో కూడా ఇవ్వగలగాలి గ్యారంటీ...

తన సృష్టికర్తను విస్మరించి తాను సృష్టించి పూజించుకోవడం మహాపరాధం కాదా?

అబద్ధం, పరనింద, మోసం, దగా, కుట్ర ఎంతటి అపరాధాలు...

ఆచరణలు అంతరంగానికి ప్రతీకలు సుమా !

మనిషి తన హృదయాన్ని సంస్కరించుకుంటే మీ పొరబాట్లను ఇట్టే మన్నిస్తాము...ఇంకా మీకు వ్యక్తిగతంగాను, జాతిపరంగా ప్రపంచ జాతుల మధ్య 'విశ్వగురు' స్థానాన్ని ప్రసాదిస్తామనేదే అసలు సిసలు గ్యారంటి...

★★★

ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.

తెలుగు – హింది – ఇంగ్లీష్ – తమిళం – కన్నడ – మరాఠీ – బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:

1800 572 3000

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం

సహజీవన భావనల పావురాయి

గీటురాయి

వారపత్రిక

# నేటి పరిస్థితుల్లో సత్య సందేశం!

డా. సాజిద్ అబ్బాసీ

**దావత్ ఇలల్లాహ్..** దైవం వైపునకు పిలుపును గురించి చర్చించే ముందు దానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను గురించి పరిశీలిద్దాం. దావత్ ఇలల్లాహ్ గురించి ఖుర్ఆన్ పలు శీర్షికల్లో వివరించింది. షహాదతె అలన్నాస్... (మానవాళి సమక్షంలో సాక్ష్యంగా నిలవడం) అమర్ బిల్ మారూఫ్ నహీ అనిల్ మున్కర్.. మంచిని పెంచి చెడును నిరోధించడం, హెచ్చరికలు, శుభవార్తలు అందజేయడం ఇవన్నీ దావత్ ఇలల్లాహ్‌లోని భాగమే.

దావత్ ఇలల్లాహ్ ప్రవక్తల ప్రధాన ఉద్యమం. ముహమ్మద్ ప్రవక్త దైవదౌత్యం ముగిశాక ఈ బాధ్యత ముస్లిమ్ సముదాయంపై పడింది. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ముస్లిములను మధ్యస్థ సమాజంగా పేర్కొని ముస్లిములకు గౌరవప్రదమైన స్థానాన్ని ప్రసాదించాడు. మానవాళి సమక్షంలో సాక్ష్యంగా నిలవడం, మంచిని పెంచి చెడును నిరోధించడం లాంటి గొప్ప బాధ్యతలను అప్పజెప్పాడు. (అల్ బఖరా 143, ఆలి ఇమ్రాన్ 110). ముస్లిమ్ సముదాయం వద్ద అల్లాహ్ పంపిన గ్రంథం, ముహమ్మద్(స) జీవితం ఉన్నాయి. చిట్టచివరి దైవ సందేశ గ్రంథమైన ఖుర్ఆన్ లేకుండా మార్గదర్శకత్వం లభించడం అసాధ్యం. మానవాళిని చీకట్ల నుంచి వెలికితీసి వెలుగు చూపించే బాధ్యత ముస్లిమ్ సమాజంపై ఉంది. ఇది ముస్లిమ్ సమాజ కర్తవ్యం. ఈ విధిని నిర్లక్ష్యం చేస్తే ముస్లిమ్ సమాజ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. (సూరహ్ ముహమ్మద్ : 38) ప్రపంచంలో తయారు చేసిన ఏ వస్తువైనా దాని లక్ష్యాన్ని నిర్వర్తించకపోతే వ్యర్థం అవుతుంది. ముస్లిమ్ సమాజంలోని ఒక చిన్న సమూహమైనా ఈ బాధ్యతను నిర్వర్తించకపోతే ఇలాంటి సముదాయాన్ని ఎంత కాలం వరకు అల్లాహ్ సహించగలడు? నేడు దేశంలో 100 మిలియన్ల జనాభాలో దావత్ ఇలల్లాహ్ పనిచేసే వారి సంఖ్య నామమాత్రమనే చెప్పుకోవచ్చు. అల్లాహ్ ఏ జాతినైనా శిక్షించాలనుకుంటే.. ఆ జాతి వారి మధ్యకు హెచ్చరిక చేసే ప్రవక్తను పంపనంతవరకూ ఆ జాతిపై ఎలాంటి శిక్షను పంపడు. అల్లాహ్, ప్రవక్త సందేశాన్ని తిరస్కరించినప్పుడే అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుతుంది. "నీ ప్రభువు జనపదాలను ఎంతమాత్రం నాశనం చేయడు, వాటి కేంద్రాలకు మా ఆయతులను వినిపించే ప్రవక్తలను పంపనంత వరకు. మేము జనపదాలను, వాటి ప్రజలు దుర్మార్గులయిపోతే తప్ప ఎంతమాత్రం నాశనం చేయము." (అల్ ఖసస్ : 59)

ముస్లిమ్ ఉమ్మత్ తన కర్తవ్యాన్ని మరిచిపోయినపుడు మేథో క్షీణతకు గురవుతుంది. ఉమ్మత్ స్థానాన్నుండి దిగజారిపోతుంది.

## ప్రస్తుత పరిస్థితుల్లో దావత్ ఇలల్లాహ్

మారుతున్న పరిస్థితుల ప్రకారం అల్లాహ్ వైపునకు పిలిచే పద్ధతిలో మార్పులు చోటుచేసుకోవచ్చు. అన్ని కాలాల్లో ముహమ్మద్ ప్రవక్త (స) జీవితంలో మార్గదర్శకత్వం లభిస్తుంది. ప్రవక్తగా తనకు బాధ్యత లభించిన తొలి మూడేళ్లు గుప్తంగా ఇస్లామ్ పిలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మూడేళ్ల కాలంలో మక్కా తిరస్కారులు ముహమ్మద్ ప్రవక్త సందేశ కార్యకలాపాలను తమకు ముప్పుగా భావించలేదు. కొత్తగా ఇస్లామ్ స్వీకరించిన

వారు తమ బంధువర్గం వారికే ఇస్లామ్ వైపునకు ఆహ్వానించేవారు. ఖుర్ఆన్ చదివి వినిపించేవారు. ఈ విధమైన సందేశ కార్యకలాపాలతో ఎన్నో కుటుంబాలు ఎలాంటి ప్రతిఘటన ఎదుర్కొనకుండానే ఇస్లామ్ స్వీకరించాయి. విజ్ఞతతో కూడిన ఈ సందేశ ప్రచార కార్యక్రమాలతో శత్రువుల నుంచి ఎలాంటి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సిన అవసరం రాలేదు. ఆ తరువాత బహిరంగ సందేశ ప్రచారం ప్రారంభించాక బహుదైవారాధకులు ఇస్లామ్కు లభిస్తున్న ఆదరణను చూసి తమ విశ్వాసాలకు, తమ నాగరికతకు పెను ముప్పుగా భావించసాగారు. మొదట్లో ఈ ప్రతిఘటన మాటల ద్వారా మొదలై భౌతిక దాడుల వరకూ చేరింది. ఆ తరువాత ముస్లిముల సామాజిక బహిష్కరణ జరిగింది. శత్రువులు చివరాఖరకు ప్రవక్త (స)ను అంతమొందించాలనుకున్నారు.

భారతదేశంలో ముస్లిముల పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోనైతే ముస్లిముల స్థితిగతులు చాలా భయానకంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో సత్యసందేశ ప్రచార బాధ్యత ఎలా అనే ప్రశ్న వస్తుంది.

మనతో సన్నిహిత సంబంధాలున్న వారికి ఇస్లామ్ సందేశాన్ని చేరవేయాలి. ఈ విషయంలో మక్కా కాలాన్ని మోడల్గా తీసుకోవాలి.

ఈ సమయంలో మనం మూడు పనులు చేయాల్సి ఉంటుంది. ఒకటి సత్యసందేశ పరిచయం. రెండోది, ముస్లిముల్లో ఇస్లామ్ పట్ల సరైన అవగాహన కల్పించి, వారిని సంపూర్ణ విశ్వాసులుగా తీర్చిదిద్దాలి.

మక్కాలోని నలుగురు ఖలీఫాల కాలంలోనూ ఇస్లామ్ వైపునకు పిలిచే పద్ధతులు మారుతూ వచ్చాయి. కానీ ఒకే నిబంధన ప్రకారం జరిగాయి. అదే దావత్ బిల్ ఖుర్ఆన్. ఇదే విషయాన్ని ఖుర్ఆన్ ఇలా ఉటంకిస్తుంది: ప్రవక్తా! వారు కల్పిస్తున్న విషయాలు ఏమిటో మేము బాగా ఎరుగుదుము. వారిచేత బలవంతంగా విషయాన్ని ఒప్పించటం నీ పని కాదు. కనుక నీవు ఈ ఖురాన్ ద్వారా నా హెచ్చరికకు భయపడే ప్రతి వ్యక్తికీ హితోపదేశం చేయి. (ఖుర్ఆన్ 50:45)

''ప్రవక్తా! అవిశ్వాసుల మాటను ఎంతమాత్రం నమ్మకు. ఈ ఖురాను ద్వారా వారితో మహత్తరమైన పోరాటం జరుపు.'' (సూరతుల్ ఫుర్ఖాన్ : 52)

ఖుర్ఆన్ బోధనల ద్వారా అల్లాహ్ వైపునకు పిలవడం అన్ని కాలాల్లోనూ ఎంతో అవసరం. ఖుర్ఆన్లో అల్లాహ్ అస్తిత్వం, దేవుని ఏకత్వం, పరలోక జీవితాన్ని నిరూపించే ఎన్నో రుజువులు పేర్కొనబడ్డాయి. ఈ ఆధారాలు ఇప్పటికీ నిరూపించబడతాయి. ఖుర్ఆన్ ఒక సజీవమైన అద్భుతమైన దైవవాణి. ప్రవక్తకు అందజేసిన అద్భుతమైన ఈ ఖుర్ఆన్ గ్రంథం ప్రళయం వరకూ సురక్షితంగా ఉంటుంది. సత్యాన్వేషకుల్ని అజ్ఞానాంధకారం నుండి వెలుగు వైపునకు తీసుకువచ్చే శక్తివంతమైన దివ్య సాధనం ఈ గ్రంథం. ''మేము త్వరలోనే వారికి మా సూచనలను వారి చుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారిలోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖురాన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమైపోతుంది.'' (హమీమ్ సజ్దా : 53)

ఖుర్ఆన్ దైవగ్రంథమనే విషయం ఖుర్ఆన్ స్పష్టం చేస్తుంది. ఇదే విషయాన్ని (అంబియా సూరా 3, సూరహ్ జారియాత్ 45, సూరహ్ మూమినూన్ : 13,14) ప్రళయ కాలం వరకూ అల్లాహ్ వైపునకు పిలిచే వారికి ఖుర్ఆన్ గ్రంథం సరైన మార్గదర్శకం చేస్తుంది.

ఎంతో మంది విద్యావంతులు సైతం ఇతర మత గ్రంథాల్లో ఉన్న అహేతుకమైన విషయాలతో నాస్తికత్వం వైపు వెళుతున్నారు. తమ మత గ్రంథ బోధనలను అసహ్యించుకుంటున్నారు. ఖుర్ఆన్ను చదవని, అర్థం చేసుకోని చాలా మంది ముస్లిమ్ యువకులు కూడా నాస్తికత్వం వైపు వెళుతున్నారు. తమకు తాము Ex-Muslims అని గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇలాంటి వారికి ఇస్లామ్ వాస్తవికతను తెలియజేసి వారిని తిరిగి ఇస్లామ్లోకి తీసుకురావడం ఇప్పుడు మనముందున్న అతి పెద్ద సవాలు. ఆర్థిక ప్రయోజనాల కోసం ఇస్లామ్ శత్రువుల పంచన చేరి రాత్రింబవళ్లు సోషల్ మీడియాలో ఇస్లామ్ను విమర్శించేవారు కూడా ఉన్నారు. ఇలాంటి వారు కేవలం పేరుకే ముస్లిములు. ఇలాంటి వారితో ఇస్లామ్కు ఎలాంటి సంబంధమూ లేదు. దావత్ ఇలల్లాహ్ రంగంలో పనిచేసేవారు నాస్తికుల సందేహాలను నివృత్తి చేసే జ్ఞానాన్ని, అవగాహనను పెంపొందించుకోవాలి. ఖుర్ఆన్ పట్ల విషయావగాహన కలిగి ఉండాలి. నేటి పరిస్థితులకు తగ్గట్లుగా ఖుర్ఆన్ వాక్యాలను జోడించి చెప్పగల నైపుణ్యాలను సంపాదించుకోవాలి. అల్లాహ్ అస్తిత్వాన్ని ఎలా నిరూపిస్తారు? అన్నది నాస్తికుల వాదన. దీనికి సంబంధించిన విషయాలు ఖుర్ఆన్ ఎన్నో చోట్ల పేర్కొన్నది. దేవుని ఏకత్వాన్ని నిరూపించే ఎన్నో వాక్యాలున్నాయి.

అల్లాహ్ అస్తిత్వం, దేవుని ఏకత్వాన్ని గురించి సంతృప్తి పరిచాక మానవ జీవిత లక్ష్యాన్ని వారి ముందుంచాలి. ఈ జీవితంలోని ప్రతీ ఘడియా పరీక్షా కాలమే. అల్లాహ్ను చూడకుండానే ప్రకృతి చిహ్నాల ద్వారా అల్లాహ్ను గుర్తించడమే మేథోపరమైన పరీక్ష. అల్లాహ్ను సృష్టికర్తగా, తన ప్రభువుగా గుర్తించిన తరువాత

అల్లాహ్ దాసులుగా మారడానికి సిద్ధపడతారా? ఈ పరీక్షలో విజయావకాశాలు కల్పించేందుకు మార్గదర్శకం కోసం ప్రవక్తలను పంపించాడు. జీవిత పరీక్ష ఫలితాల సమయమూ నిర్ణయమై ఉంది. దేవుని ఏకత్వం, పరలోక విశ్వాసం, దైవదౌత్యం లాంటి విశ్వాసాలు ఈ ప్రాపంచిక జీవిత వాస్తవాన్ని తెలియజేస్తాయి.

అల్లాహ్ వైపునకు పిలుపునిచ్చే విషయంలో ఖుర్‌ఆన్ మార్గనిర్దేశనం చేస్తుంది. "ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు." (ఖుర్‌ఆన్ 16:125)

అల్లాహ్ వైపునకు పిలవడంలో బుద్ధీ, జ్ఞానాలు వినియోగించాలన్నది పై ఖుర్‌ఆన్ ఉద్బోధ. సంబోధితుల మనస్తత్వాన్ని దృష్టిలో ఉంచుకుని హృదయానికి హత్తుకునేలా చెప్పాలి.

దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోకం లాంటి విశ్వాసాలను నిరూపించే ఆధారాలు ఖుర్‌ఆన్‌లో ఎన్నో ఉన్నాయి. ఖుర్‌ఆన్‌లో ప్రవక్త సందేశ ప్రచార ఉపమానాలూ ఎన్నో ఉన్నాయి.

ఇస్లామ్, ముస్లిముల గురించి ఏమైనా అపోహలు, అపార్థాలుంటే అడగాలని సున్నితంగా చెప్పాలి. ఈ ద్వేషపూరిత వాతావరణంలో నిజమైన సోదరభావాన్ని పెంపొందించడానికి అపార్థాలను తొలగించడం అవసరం. ఇస్లామ్ వైపునకు పిలుపునిచ్చే గొప్ప అవకాశంగా దీన్ని మలుచుకోవాలి.

ఇస్లామ్‌పై ఉన్న ద్వేషపూరిత ఆరోపణలను ఖండించి వాటికి సరైన వివరణ ముస్లిములు ఇవ్వకపోతే మరెవరిస్తారు?

మృదుభాష్యంతో, చక్కని భాషా పరిజ్ఞానంతో ఇస్లామ్ ధర్మాన్ని ఆకట్టుకునేవిధంగా వివరించడం, అపోహలు, అపార్థాలకు సరైన సమాధానాలు సిద్ధం చేసుకోవడం- ఇవన్నీ నేడు ఎంతో అవసరం.

దావత్ ఇలల్లాహ్‌ను తమ జీవిత లక్ష్యంగా చేసుకున్నవారు తమలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. మరీ ముఖ్యంగా ప్రసంగ నైపుణ్యాన్ని పెంచుకోవాలి. నిత్యం జ్ఞానాన్ని ఆర్జిస్తూ ఉండాలి. ఖుర్‌ఆన్ పట్ల మక్కువ పెంచుకోవాలి.

సందేశ తపనతో దావా రంగంలో అడుగుపెట్టండి. ప్రవక్తలు, దైవప్రవక్త ఈ మార్గంలో ఎన్నో కష్టాలు అనుభవించారు. ప్రజల దుర్భాషలు విన్నారు, రాళ్ల దెబ్బలు సహించినప్పటికీ ఎన్నడూ సహనాన్ని కోల్పోలేదు. వారిపట్ల మేలును ఆకాంక్షించారు.

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండేవాళ్లు సోషల్ మీడియాను సత్యసందేశ ప్రచారం కోసం మంచి వేదికగా మలుచుకోవచ్చు. చర్చలూ నడుస్తున్నాయి. ముస్లిమేతరుల్లో ఉన్న అపోహలు, అపార్థాలు దూరమవుతున్నాయి. సోషల్ మీడియా ద్వారా చెడు మాత్రమే కాదు, మంచి కూడా వ్యాప్తి చెందుతుంది.

Visit the Mosque ప్రోగ్రాములు జరిగిన ప్రాంతాల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. ❖


యువతరానికి
**విప్లవనాదం**
**చేతనవాదం**

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

**లేదా**

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# బరి తెగింపు!

**రాఫా**పై దాడిని వెంటనే నిలిపివేయాలని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఆదేశాలు ఇచ్చినా, మిగతా దేశాలు వద్దని వారిస్తున్నా ఇజ్రాయెల్ ఖాతరు చేయడం లేదు. ఆదివారం రాత్రి రాఫాపై అది చేసిన భీకరమైన వైమానిక దాడి దాని తెగింపునకు నిదర్శనం. శరణార్థ శిబిరం అని తెలిసి కూడా అది ఈ మారణకాండకు పాల్పడింది. యాభైమంది మరణించడంతో పాటు మరో వందమంది గాయపడ్డారు. మరణించినవారిలో అత్యధికులు పిల్లలు, మహిళలే. గాజా మీద ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో అత్యంతపాశవికమైన దాడిగా ఇది చరిత్రలో నిలిచిపోతుంది. గతంలో ఈ ప్రాంతాన్ని సురక్షితమైనదిగా ఇజ్రాయెల్ ప్రకటించడంతో గాజాలోని మిగతాచోట్లనుంచి తరలి వచ్చిన పాలస్తీనియన్లు ఇక్కడ గుడారాలు వేసుకొని ఉంటున్నారు. తాను సురక్షితమని ప్రకటించిన ప్రాంతాన్నే ఇప్పుడు ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. మంటల్లో కాలుతున్న మృతదేహాలు, అవయవాలు తెగిన చిన్నారుల వీడియోలను చూసిన ప్రపంచం దిగ్భ్రాంతి చెందింది. అమెరికా సహా ఇజ్రాయెల్ సన్నిహితదేశాలు కూడా ఈ దాడిని ఖండించాయి. హమాస్ కమాండర్‌లు ఉన్నారన్న సమాచారంతోనే ఈ దాడి జరిపామని ఇజ్రాయెల్ సైన్యమూ, రక్షణమంత్రి ఒకపక్క వాదిస్తుంటే, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ మాత్రం పొరపాటు జరిగిందని పార్లమెంటులో ఒప్పుకున్నారు. కానీ, రాఫా చొరబాటును ఆపేది లేదని విస్పష్టంగా ప్రకటించారు. రాఫాలో మూడు రోజులుగా ఇజ్రాయెల్ ప్రదర్శిస్తున్న రాక్షసత్వం ప్రతి ఒక్కరినీ కుదిపేస్తున్నది. 'ఆల్ ఐస్ ఆన్ రాఫా' పేరిట సామాజిక మాధ్యమాల్లో సానుభూతి, సంఘీభావం వెల్లువెత్తుతున్నాయి. అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు ఇందులో భాగస్వాములవుతున్నారు.

రాఫాలో మారణకాండ కొనసాగుతున్న తరుణంలో అత్యధికులకు జోబైడెన్ చేసిన 'రెడ్ లైన్' హెచ్చరిక గుర్తుకు వస్తున్నది. ఇజ్రాయెల్ ఇంకా అంతవరకూ రాలేదా? అని వారంతా ప్రశ్నిస్తున్నారు. కానీ, అమెరికా అధ్యక్షులవారి ఈ లక్ష్మణరేఖ నెతన్యాహూకు అనుకూలంగా ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటుంది. రాఫాలో ఇజ్రాయెల్ తీవ్ర ఘోరాలకు పాల్పడుతున్నప్పటికీ, దానికి సహాయనిరాకరణ చేసే ఆలోచనలో అమెరికా లేదు. మనసు తరుక్కుపోతోంది, దృశ్యాలు భయానకంగా ఉన్నాయి అంటూనే, హమాస్‌కు బుద్ధిచెప్పే హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నదని, అయితే, సామాన్యులకు హాని జరగకుండా చూసుకోవాలని సుద్దులు చెబుతోంది. మూడు లక్షల మంది స్థానికులతో పాటు, పది లక్షల మంది శరణార్థులున్న రాఫాలోకి ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రవేశిస్తే ఏం జరుగుతుందో అమెరికాకు తెలియనిది కాదు. మరో మారణకాండకు, ఊచకోతకు అడ్డుపడుతున్నట్టు కనిపించడమే తప్ప దానిని అడ్డుకొనే ఉద్దేశం అమెరికాకు ఏ మాత్రం లేదు. ఆర్థిక సాయం చేయననీ, ఆయుధాలు ఇవ్వననీ చెప్పిన కబుర్లన్నీ వట్టివేనని తేలిపోయాయి. యుద్ధం ఆరంభమైన ఈ ఎనిమిది నెలల్లో ఎక్కడెక్కడో తిరిగి, చివరకు ఇది భద్రమైన ప్రాంతమని నమ్మివచ్చి, తలదాచుకున్నవారంతా ఇప్పుడు ఇజ్రాయెల్ క్షిపణులకు బలైపోతున్నారు. తల్లిదండ్రుల సమక్షం లోనే పిల్లలు సజీవంగా తగలబడిపోతున్నారు.

హమాస్ కమాండర్లు అక్కడ తలదాచుకున్నారని, తమ దాడుల్లో కొందరు చనిపోయారని, భారీ ఆయుధాగారాలు బయటపడ్డాయని ఇజ్రాయెల్ ఏదో ఒక కథ వినిపిస్తూ తన మారణకాండను ఎనిమిది నెలలుగా యథేచ్ఛగా కొనసాగిస్తున్నది, కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోంది. అగ్రరాజ్యాల అండదండలతో అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను సైతం అది బేఖాతరు చేయగలుగుతోంది. ఐసీజే ఆదేశాలు వెలువడిన రెండురోజుల్లోనే అది ఇంతటి బీభత్సానికి ఒడిగట్టి, అంతర్జాతీయ నిబంధనలు, కట్టుబాట్లు తనకు పట్టవనీ, యుద్ధ నియమాలు తనకు వర్తించవని మరోమారు తేల్చిచెప్పింది. ఇజ్రాయెల్ ప్రధాని, రక్షణమంత్రితో పాటు హమాస్ అధినేతను కూడా యుద్ధనేరస్తులుగా ప్రకటించి, అరెస్టు వారెంట్లు జారీ చేయాలంటూ ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)లో ప్రాసిక్యూటర్ కరీంఖాన్ ఇటీవల వాదించారు. న్యాయస్థానం ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చును గానీ, ఈ సందర్భంగా ప్రాసిక్యూటర్ చేసిన వాదనలు మాత్రం ఇజ్రాయెల్ పాలకులు అందుకు సర్వవిధాలా అర్హులని స్పష్టంగా తేల్చి చెబుతున్నాయి. ప్రపంచదేశాలన్నీ ఇజ్రాయెల్‌ను ఇప్పటికైనా దారికి తీసుకురావడం అవసరం.

**(30 మే 2024 'ఆంధ్రజ్యోతి' సంపాదకీయం)**

# మనోవాంఛల దాస్యం జీవితంపై వేసే దుష్ప్రభావం

**- ప్రొఫెసర్ సవూద్ ఆలమ్ ఖాస్మీ**

**అల్లాహ్** మనిషిని ప్రాణులన్నింటిలోను ఉత్తమమైన, ఉన్నతమైన జీవిగా సృష్టించాడు. మనిషికి రూపురేఖలు, శారీరక సౌష్టవం అత్యుత్తమంగా తీర్చిదిద్దాడు. బుద్ధివివేకాలు, అవగాహన, తెలివి తేటలు కూడా ప్రసాదించాడు. దేహము ఆత్మ– ఈ రెండింటి కలయికే మనిషి. ఈ రెండింటి మేళవింపే జీవితం. దేహము, ఆత్మ– ఈ రెండింటి అవసరాలు కొన్ని ఉన్నాయి. వాటిని పూర్తి చేసినప్పుడే మనిషి పరిపూర్ణ మానవుడు కాగలడు. తినడం, తాగడం, దుస్తులు ధరించడం, నిద్రించడం, మేల్కొనడం, లైంగిక కోరికల పరిపూర్తి, వేడి నుంచి చలి నుంచి రక్షణ పొందడం, సుఖదుఃఖాల పరిస్థితులను ఎదుర్కోవడం– ఇవన్నీ దేహానికి సంబంధించినవి. విద్యాజ్ఞానాలు, ఆరాధనలు, దైవనామస్మరణ, న్యాయం, నిజాయితీ, నైతికత, త్యాగనిరతి, సానుభూతి, మానవ సేవ– ఇవన్నీ ఆత్మకు సంబంధించినవి. ఈ అవసరాలను మనిషి పూర్తిచేయాల్సి ఉంటుంది. మనిషి ఈ అవసరాలను సమతుల్యంగా పూర్తి చేసినప్పుడే పరిపూర్ణ మానవునిగా మారుతాడు. కాని వీటిని విస్మరిస్తే, ఏదో ఒకవైపు ఎక్కువ మొగ్గు చూపిస్తే అసంపూర్ణ మానవునిగా మిగిలిపోతాడు. అసమతౌల్య వైఖరి, అతివాదాలతో మానవత లోపిస్తుంది. ఇలాంటి వైఖరి వల్ల మానవత పరిపూర్ణత్వం పొందదు.

మనిషి కొన్ని సార్లు ఆత్మకు సంబంధించిన అవసరాల విషయంలో అతిశయిల్లి అటువైపు ఎక్కువగా మొగ్గుచూపుతాడు, దేహానికి సంబంధించిన ధర్మబద్ధమైన అవసరాలను కూడా విస్మరిస్తాడు. కొన్ని సందర్భాల్లో శరీరాన్ని కష్టపెట్టడం ఆత్మకు మేలనుకుంటాడు. తన సుఖసంతోషాలను త్యజించడం, ప్రపంచాన్ని త్యజించడంలో అతిపోకడ ఏ స్థాయికి వెళుతుందంటే నిర్మాణము, వికాసము, సంస్కృతి, నాగరికతలకు తనవంతు సేవలందించే ఉత్సాహమే అంతరించిపోతుంది. ఇదే ఆధ్యాత్మికతకు ఔన్నత్యంగా భావిస్తాడు. ఆధ్యాత్మిక సంతృప్తి అన్వేషణలో మనిషి తనను, తన సన్నిహితులను, కుటుంబాన్ని, తోటివారిని, సమాజాన్ని అందరినీ వదిలేస్తాడు. అడవుల్లో, కొండల్లో, నిర్మానుష్య ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ప్రశాంతతను అన్వేషిస్తూ తోటి మనుషులకు దూరంగా జీవితం గడపడం ప్రారంభిస్తాడు.

సన్యసించడం అనేది నిరాడంబరమైన, నిష్కల్మషమైనదిగా పైకి కనిపించినప్పటికీ ఇస్లాం ఈ వైఖరిని ప్రోత్సహించదు. ఎందుకంటే ఇది మానవ జీవితానికి అవసరమైన ప్రామాణిక జీవనం కాదు. ఈ వైఖరి మానవసమాజాలకు సంతృప్తికరమైనది, పురోగమన శీలమైనది కానే కాదు. ఒకవేళ మనుషులందరు ఈ వైఖరిని అవలంబిస్తే మానవ ప్రపంచం నిర్మానుష్యమైపోతుంది. చివరకు ప్రపంచం జంతువుల నిలయమైపోతుంది. క్రూర జంతువులు వేటాడే ప్రదేశంగా మిగిలిపోతుంది.

చరిత్రలో బుద్ధుడు, మానిచాయిజం మతాన్ని బోధించిన మాని, క్రీస్తు మతానుయాయులు ఆధ్యాత్మికానందాన్ని పొందడానికి ఇలాంటి జీవన విధానాన్నే అవలంబించేవారు. కాని అల్లాహ్ ఈ వైఖరిని ఇష్టపడలేదు. దీన్ని విమర్శిస్తూ దివ్య ఖుర్‌ఆన్ ఇలా చెప్పింది:

**“వైరాగ్యాన్ని (రుహ్బానియత్) వారు స్వయంగా కనిపెట్టారు.**

**మేము దానిని వారిపై విధించలేదు. కాని అల్లాహ్ ప్రసన్నతను పొందటానికి వారే స్వయంగా ఈ దురాచారాన్ని సృష్టించారు. తరువాత దానిని పాటించే విషయంలో, న్యాయం చేకూర్చలేక పోయారు. వారిలో విశ్వసించిన వారికి మేము వారి ప్రతిఫలాన్ని ప్రసాదించాము. కాని వారిలో పలువురు అవిధేయులు."**

**(అల్ హదీద్ : 27)**

సన్యాసత్వం, ప్రపంచ జీవితాన్ని త్యజించడం అనేది మనిషి దైహిక అవసరాల పరిపూర్తిని విస్మరించేలా చేస్తుంది. ఆధ్యాత్మిక ఆనందం కోసం కోరికలను చంపుకోవడం, ప్రపంచాన్ని త్యజించడం తప్పనిసరిగా భావించే వైఖరి ఇది.

సన్యాసత్వానికి వ్యతిరేకమైన మరో జీవన వైఖరి పదార్థ పూజ లేదా ప్రపంచ వ్యామోహం. మనిషి ఆధ్యాత్మిక అవసరాలను పూర్తిగా విస్మరిస్తాడు. కేవలం దేహ అవసరాలు, మనోవాంఛల పరిపూర్తికి మాత్రమే ప్రయత్నిస్తుంటాడు. ఈ ప్రయత్నాల్లోనే పూర్తి జీవితం గడిపేస్తాడు. పదార్థ పూజ (భౌతికతత్వం) మనిషిని స్వార్థపరుడిగా, స్వంత ప్రయోజనాల కోసం ప్రయత్నించేవాడిగా మార్చేస్తుంది. ఇలాంటి మనిషి ఈ ప్రాపంచిక జీవితమే సమస్తంగా భావిస్తాడు. తన కోసం, తన కుటుంబం కోసం మాత్రమే ఆలోచిస్తుంటాడు. ఈ లాభనష్టాల గురించి మాత్రమే పట్టించుకుంటాడు. ఈ వ్యవహారాలే అతనికి ముఖ్యమైనవిగా ఉంటాయి. ఈ కలలే చూస్తుంటాడు. ప్రపంచవ్యామోహాన్ని దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది:

**వారు ఇలా అంటారు, "జీవితం అంటే కేవలం మన ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే. ఇక్కడే మన మరణం, ఇక్కడే మన జీవనం. కాల పరిభ్రమణం తప్ప, మనలను ఏదీ చంపలేదు." వాస్తవంగా ఈ విషయానికి సంబంధించిన జ్ఞానమేదీ వారివద్ద లేదు. వారు కేవలం ఊహ ఆధారంగా ఈ మాటలు అంటున్నారు. (అల్ జాసియా: 24)**

ప్రపంచ వ్యామోహంలో మునిగిపోయిన మనిషి తన మనస్సాక్షి, అంతర్దృష్టి, హృదయం, ఆత్మ, వాస్తవిక జ్ఞానం గురించి మరిచి పోతాడు. అలాంటి మనిషి దృష్టి ఎల్లప్పుడు ప్రాపంచిక సుఖభోగాలపై మాత్రమే ఉంటుంది. చివరకు తప్పించుకోలేని వాస్తవమైన మరణాన్ని కూడా తప్పించుకోవాలని శతప్రయత్నాలు చేస్తాడు. కాని ఈ ప్రయత్నాలు ఫలించవు. దివ్యఖుర్ఆన్ ఈ విషయమై ఇలా పేర్కొంది:

**"జీవితం పట్ల అందరికంటే ఎక్కువ వ్యామోహం వీరిలోనే ఉందనే విషయం నీవు గ్రహిస్తావు. ఈ విషయంలో వారు ముష్రిక్కులనే మించిపోయారు. వారిలోని ఒక్కొక్క వ్యక్తి ఏదో ఒక విధంగా వేయి సంవత్సరాలు బ్రతకాలని కోరుకుంటాడు. కాని దీర్ఘాయుర్దాయం వారిని శిక్ష నుండి ఎంతమాత్రం తప్పించలేదు. వారు ఏయే పనులు చేస్తున్నారో వాటిని అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు." (బఖరా : 96)**

ప్రవక్త ముహమ్మద్ (స) "ముసలివాని మనసు కూడా దీర్ఘాయుష్షు, సంపద పట్ల వ్యామోహాల విషయంలో యవ్వనంతోనే ఉంటుంది" అన్నారు. (సహీహ్ ముస్లిం, కితాబుజ్జకాత్)

ఈ ప్రపంచంలో సాధనా సంపత్తులన్నీ ఒకే వ్యక్తికి దొరకవన్న వాస్తవాన్ని ప్రపంచ వ్యామోహం కలిగిన వాళ్ళు మరిచిపోతారు. ప్రతి వ్యక్తికి అతని శ్రమ, దైవానుగ్రహాల కారణంగా లభించ వలసింది లభిస్తుంది. ప్రపంచంలోని మనుషులందరు సంపద, వనరుల విషయంలో సమానులు కాలేరు. కొందరు సంపన్నులు, కొందరు నిరుపేదలు, కొందరు బలవంతులు, కొందరు బలహీనులు, కొందరు అధికారులు, కొందరు సేవకులు... ఇందులో ఎవరు దైవం పట్ల కృతజ్ఞులై ఉంటారన్నదే అసలు పరీక్ష.

**"ఈ ప్రపంచ జీవితంలో వారి బ్రతుకు తెరువు మార్గాలను మేమే వారి మధ్య పంచాము. వారిలో కొందరికి మరి కొందరిపై అంతస్తులవారిగా ఆధిక్యం ఇచ్చాము, వారు ఒకరింకొకరి సేవలు పొందటానికి. నీ ప్రభువు కారుణ్యం (అంటే ప్రవక్త పదవి) వారు సమీకరించే సంపద కంటే ఎంతో విలువైనది. మానవులందరూ ఒకే మార్గాన్ని అనుసరిస్తారేమో అనే భయం లేకపోతే మేము కరుణామయుడైన దేవుణ్ణి తిరస్కరించే వారి ఇళ్ల కప్పులనూ, వారు తమ మేడలపైకి ఎక్కే మెట్లనూ, వారి తలుపులనూ, వారు దిండ్లపై ఆనుకుని కూర్చునే తఖతులనూ, అన్నింటినీ వెండితో, బంగారంతో చేయించి ఉండే వారమే. ఇవి కేవలం ఐహిక జీవిత సంపదలు మాత్రమే. నీ ప్రభువు దగ్గర గల పరలోకం కేవలం దేవుని పట్ల భయభక్తులు గల వారికే లభిస్తుంది." (జుఖ్రుఫ్ : 32-35)**

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స) శిస్తులు వసూలు చేయడానికి అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజి)ను బహ్రెయిన్ పంపించారు. ఆయన శిస్తులు వసూలు చేసుకుని మదీనా తిరిగి వచ్చినప్పుడు అన్సారులకు ఆయన వస్తున్న వార్త తెలిసింది. వారంతా ఫజ్ర్ నమాజు సమయంలో నబవీ మస్జిదులో చేరారు. నమాజు తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) వారివైపు తిరిగి చూసి చిరునవ్వుతో ఇలా అన్నారు :

"అబూ ఉబైదా సొమ్ముతో తిరిగి వచ్చిన వార్త మీకు అందిందను కుంటాను."

ఈ మాటలు విని వారు అవునన్నారు. అప్పుడు ప్రవక్త వారితో "సంతోషంగా ఉండండి. అల్లాహ్ మీకు ఏది ప్రసాదిస్తాడో దాన్ని ఆశించండి. అల్లాహ్ సాక్షి, మీరు పేదరికానికి, ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్న భయం నాకు లేదు. కాని ఈ ప్రపంచం మీ పూర్వ జాతుల వారి ముందు ఏ విధంగా పరచబడిందో ఆ విధంగానే మీ ముందు పరచబడుతూ ఉంటుంది, వాళ్ళు ఎలా ప్రపంచ వ్యామోహంలో ఒకరితో ఒకరు పోటీపడ్డారో మీరు కూడా అలాగే పోటీ పడతారన్న భయం నాకు ఉంది. ఈ వైఖరి మీ మునుపటి జాతులను ఎలా పతనం చేసిందో మిమ్మల్ని కూడా అలాగే పతనానికి గురి చేస్తుందేమోనన్న భయం నాకు ఉంది" అన్నారు.

(సహీహ్ ముస్లిం, కితాబుజ్జుహ్ద్)

## పదార్థ పూజ ప్రగతి కాదు

పదార్థ పూజ అంటే సంపదను, భోగభాగ్యాలను పవిత్రమైనవిగా వాటినే పూజించే వైఖరి మాత్రమే కాదు, ఇది ఒక జీవనవిధానంగా, ఒక సంస్కృతిగా, ఒక నాగరికతగా ఒక వ్యవస్థగా, అంతర్గత, బాహ్య ప్రభావాలను వేస్తుంది. ఇది సన్యాసత్వం మాదిరిగా నిరాడంబరమైన, నిష్కల్మషమైన, నిరపాయకరమైనది కాదు. ఈ వైఖరి చాలా ప్రమాదకరమైనది, అపాయకరమైనది. ఇది దౌర్జన్యపూరితమైనది. మోసపూరితమైనది. ఈ వ్యవస్థలో సమస్తం కేవలం సంపదను పెంచుకోవడం, ప్రాపంచిక సంపదలను పోగుచేసుకోవడం, లాభాల కోసం అర్రులు చాచడం మాత్రమే ఇందులో ప్రధానం. ఇవి తప్ప మరి దేనికీ ప్రాముఖ్యం ఉండదు. మానవసంబంధాలు, ధార్మిక సేవలు ఏవీ ఈ వ్యవస్థలో ముఖ్యం కాదు. చివరకు ప్రగతీ వికాసాలు కూడా కేవలం భోగభాగ్యాల కొలబద్దలపైనే నిలబడతాయి. ఈ ప్రపంచ వ్యామోహాన్ని గురించి అల్లాహ్ ఇలా వివరించాడు:

**"యథార్థం ఏమిటంటే మమ్మల్ని కలుసుకోవాలని ఆశించని వారూ ప్రాపంచిక జీవితమునే వరించి దానితోనే తృప్తి చెందిన వారూ మా సూచనల పట్ల నిర్లక్ష్య భావం కలిగివున్నవారూ – అటువంటి వారి అంతిమ నివాస స్థలం నరకమే అవుతుంది. వారు (తమ ఈ తప్పుడు విశ్వాసం, తప్పుడు ప్రవర్తనలు కారణంగా) చేస్తూ వచ్చిన చెడులకు ఫలితంగా."**

**(యూనుస్: 7,8)**


మౌలానా మౌదూదీ ధనసంపదలు, భోగభాగ్యాలు తాత్కాలికమైనవని వివరిస్తూ ఇలా చెప్పారు:

**"ప్రాపంచిక జీవితం, ఇందులోని ఆకర్షణలు అన్నీ తాత్కాలికమైనవి. ప్రతి వసంతం తర్వాత శిశిరం తప్పదు. యవ్వనం తర్వాత వృద్ధాప్యం, మరణాలు తప్పవు. ప్రతి ఉత్థానం పతనాన్ని చూస్తుంది. కాబట్టి పరలోకాన్ని మరిచిపోయేంత అందమైనది కాదు ప్రపంచం. ఇక్కడి మున్నాళ్ళ సుఖవిలాసాల కోసం పరలోకాన్ని నాశనం చేసే పనులకు పాల్పడరాదు."**
**(తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్, సూరా జుమర్, ఆయత్ : 20)**

భౌతిక సంపదల అభివృద్ధి మాత్రమే ప్రగతి కాదంటుంది దివ్య ఖుర్‌ఆన్. దీనికి సంబంధించి ఖారూన్ ఉదాహరణను దివ్య ఖుర్‌ఆన్ మన ముందుంచింది. ఖారూన్ అంతం ఎంత విషాదకరంగా ముగిసిందో వివరించింది. ఖారూన్ ధనసంపదల ఖజానాలు అన్నీ తన వద్ద ఉంచుకున్నాడు. అతని వంటి సంపన్నుడు లేనేలేడు. అయినా చివరకు మరణించాడు. కేవలం సంపదలు కూడబెట్టడమే ముఖ్యమైనట్లయితే, వాటికి ఆమోదం లభించి ఉన్నట్లయితే ధన సంపదలతో తులతూగే మనిషి ఎప్పటికీ చావకుండా ఉండాలి. ఈ విషయాన్ని దివ్యఖుర్‌ఆన్ ఇలా చెప్పింది :

**ఒకనాడు అతడు (ఖారూన్)తన జాతి ముందు తన పూర్తి వైభవంతో ప్రత్యక్షమయ్యాడు. ఐహిక జీవితం పట్ల వ్యామోహం కలవారు అతణ్ణి చూచి ఇలా అన్నారు, "ఖారూన్‌కు ఇవ్వబడింది మాకూ లభిస్తే ఎంత బాగుండును. అతడు చాలా అదృష్ట వంతుడు." కాని జ్ఞాన సంపన్నులు ఇలా అన్నారు, "అయ్యో దౌర్భాగ్యులారా! అల్లాహ్ ఇచ్చే ప్రతిఫలమే విశ్వసించి మంచి పనులు చేసే వ్యక్తికి శ్రేష్ఠమైనది. ఈ మహాభాగ్యం సహనం చూపే వారికి తప్ప మరెవరికీ దొరకదు."**

**(ఇంకా వుంది...)**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**